E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 13-01-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక: 13|| పేజీలు–6 www.ekaburu.com




గూగుల్ సెర్చ్ లో కొత్త సదుపాయం.. వెతికిన చోటే షాపింగ్!

» 4లో

## వ్యూహాత్మక సుస్థిరత సాధిద్దాం



» భారత్, జర్మనీ ఉమ్మడి నిర్ణయం

» ద్వైపాక్షిక చర్చలు జరిపిన భారత ప్రధాని మోదీ, జర్మనీ చాన్స్‌లర్ మెర్జ్

ఈ-కబురు, /న్యూఢిల్లీ: మారుతున్న అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అంశాలు, యుద్ధాలు, ఉద్రిక్తత పరిస్థితుల నడుమ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, జర్మనీ ఉమ్మడిగా నినదించాయి. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా పరస్పరం వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఇరుదేశాలు ఉమ్మడిగా నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు ప్రధాని మోదీ, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్‌లు విస్తృతస్థాయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

తర్వాత సోమవారం ఢిల్లీలో ఇరుదేశాధినేతలు సంయుక్త ప్రకటన విడుదలచేశారు. రక్షణ, వాణిజ్యం,భూ అయస్కాంత లోహాలు, సెమీకండక్టర్లు సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై అగ్రనేతలిద్దరూ చర్చించారు. అంతర్జాతీయ సమస్యలకు ఉమ్మడిగా పరిష్కారాలు సూచించే స్థాయికి ద్వైపాక్షిక బంధాలను దృఢపర్చుకోవాలని నేతలు నిర్ణయించుకున్నారు.

తరువాయి 2లో

# త్వరలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ!



» ప్రజాభీష్టం మేరకు మండలాలు, రెవెన్యూ డివిజన్ల హేతుబద్ధీకరణ: సీఎం రేవంత్

» గత ప్రభుత్వం రాజకీయ కోణంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేసింది

» శాస్త్రీయత పాటించకపోవడంతో ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు

» ఈ పరిస్థితిని సరి చేయాలి.. దీనిపై వచ్చే బడ్జెట్ సమావేశాల్లో డిబేట్ పెడతాం

» సలహాలు, సూచనలు తీసుకుంటాం

» కమిషన్ ఏర్పాటు చేసి నివేదిక మేరకు చర్యలు చేపడతాం

» టీజీవో డైరీ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి

ఈ-కబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను పునర్వ్యవస్థీకరించాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత పాటించకుండా ఏర్పాటు చేసిన జిల్లాలు, మండలాలతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం రాజకీయ విభజన కోణంలో ఏర్పాటు చేసిన జిల్లాలను ప్రజల అభీష్టం మేరకు హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

అప్పట్లో అడ్డగోలుగా విభజన

'గత ప్రభుత్వం రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలను ఇష్టానుసారంగా విభజించింది. ఒక జిల్లాలో ఒక అసెంబ్లీ నియోజకవర్గం ఉంటే, మరో జిల్లాలో 14 ఉన్నాయి. ఇక మండలాలు, రెవెన్యూ డివిజన్ల విభజన అడ్డగోలుగా జరిగింది. జిల్లాల సంఖ్య తగ్గించడం, పెంచడం అని కాదు కానీ రేషనలైజేషన్ చేయాల్సిన అవసరం ఉంది. ఏ విధంగా చేయాలి.. ఒక మండలంలో ఎంత జనాభా ఉండాలి, ఒక డివిజన్‌లో ఎంత ఉండాలి, ఒక జిల్లాలో ఎంత ఉండాలనేది నిర్ణయించాలి. ప్రస్తుతం ఒక జిల్లాలో 3 లక్షల జనాభా ఉంటే ఒక జిల్లాలో కోటి జనాభా ఉంది. ఇలాంటప్పుడు పరిపాలన ఏవిధంగా చేస్తారు? ఇలాంటి సమస్యలు మా దృష్టికి వచ్చాయి. ఒక లీడర్ తనకు నచ్చిన 3, 4 గ్రామాలతో ఒక మండలాన్ని ఏర్పాటు చేసుకుంటే...

తరువాయి 2లో

## ప్రేక్షకులు లేకుండానే డబ్ల్యూపీఎల్‌లో ఆ మూడు మ్యాచ్‌లు

» 6లో

## ఆ విషయంలో నాది అత్యాశే!

» 5లో





## పోలవరంనల్లమలసాగర్‌పై...
# రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదు

» స్పష్టం చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

» ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం

» వెంటనే సివిల్ సూట్ దాఖలు చేస్తామని వెల్లడి

ఈ-కబురు,ఢిల్లీ:పోలవరం-నల్లమలసాగర్ ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలపకముందే ఆ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం

తరువాయి 2లో



## ఇది కచ్చితంగా ఏపీకి సహకరించడమే

సుప్రీంకోర్టులో విచారణకు అర్హత లేని పిటిషన్ వేస్తారా?: హరీశ్‌రావు

తరువాయి 3లో

# కక్ష్య చేరని 'అన్వేష'ణ

» విఫలమైన పీఎస్ఎల్‌వీసీ62 ప్రయోగం

» మూడోదశ ఆఖరులో సాంకేతిక లోపం



ఈ-కబురు, , తిరుపతి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎస్ఎల్‌వీ-సీ62 ప్రయోగం విఫలమైంది. కొత్త ఏడాదిలో తొలి విజయాన్ని నమోదు చేయాలని భావించిన శాస్త్రవేత్తలు నిరాశకు గురయ్యారు. సోమవారం ఉదయం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి నిప్పులు చిమ్ముతూ నింగికి ఎగసిన రాకెట్ కీలకమైన మూడోదశ ఆఖరులో సాంకేతిక లోపం తలెత్తడంతో గతి తప్పింది. ఫలితంగా దేశ రక్షణకు కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' (అన్వేష) సహా మొత్తం 16 ఉపగ్రహాలు నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయాయి. వీటిలో వివిధ దేశాలకు చెందిన 15 చిన్న ఉపగ్రహాలు ఉన్నాయి.

తరువాయి 2లో



## ఏడాదిలో లక్ష వీసాల రద్దు.. ట్రంప్ సర్కారు దూకుడు

న్యూయార్క్: డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో లక్ష వీసాలను అమెరికా రద్దు చేసింది. ఇందులో 8,000 విద్యార్థి, 2,500 ప్రత్యేక వీసాలున్నాయి. అమెరికా భద్రతా బలగాలతో తలపడిన వారి వీసాలను రద్దు చేసినట్లు సోమవారం విదేశాంగశాఖ ప్రకటించింది. వీరిని తిప్పి పంపుతున్నామని వెల్లడించింది.

» 3లో

# ఒక్క జిల్లాను ముట్టుకున్నా.. ఉద్యమమే

» 3లో

కేసీఆర్‌కు పేరొస్తుందని 'పాలమూరు' పూర్తిచేయడం లేదు

సర్పంచుల ఆత్మీయసభలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ఈ-కబురు,మహబూబ్‌నగర్: 'ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని జిల్లాలు ఏర్పాటు చేసి కలెక్టర్లను గడప దగ్గరకు తీసుకొస్తే.. జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదనే సాకుతో ఎత్తేయాలని ఈ ప్రభుత్వం చూస్తోంది..

# నీటి హక్కుల సాధనకు అన్ని స్థాయుల్లో పోరాటం

» కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క బొట్టునూ వదులుకోం: మంత్రి ఉత్తమ్

ఈ-కబురు,ఢిల్లీ: "జల వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామంటూ ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు చెప్పిన మాటలతో ఏకీభవిస్తున్నాం. అదేసమయంలో నదీ జలాల్లో తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడుకోవడానికి మేం న్యాయపరమైన చర్యలనూ తీసుకుంటున్నాం" అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.



తరువాయి 2లో

# త్వరలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ!



మరొకాయన 2, 3 ఎంపీటీసీలతో ఒక మండలాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. నేను ఎంపీగా ఉన్నప్పుడు మేడ్చల్ జిల్లా పరిషత్ సమావేశానికి వెళ్లా. వేదికపై చైర్మన్, వైస్ చైర్మన్ ఇద్దరు మాత్రమే కూర్చున్నారు. మరొకాయన రాలేదు. నాకు ఎవర్ని చూసి మాట్లాడాలో అర్థం కాలేదు. జిల్లా ఈ విధంగా ఉంటే ఎలా? ఇలాంటి తప్పిదాల వల్ల పాలనపై నమ్మకం పోతుంది. దీన్ని సరి చేయాలి..' అని సీఎం అన్నారు.

**తొలుత మండలాల హేతుబద్ధీకరణ**

'ముందుగా మండలాలను హేతుబద్ధీకరించాలి. మండలంలో 10 శాతం ఎక్కువ జనాభా లేదా తక్కువ.. రెవెన్యూ డివిజన్, జిల్లాల్లో కూడా ఇదే ఫార్ములాతో విభజన జరగాలి. దీనిపై అసెంబ్లీలో డిబేట్ పెడతాం. అందరి సలహాలు, సూచనలు తీసుకుంటాం. మార్గదర్శకాలు రూపొందిస్తాం. కూలంకషంగా చర్చించిన తర్వాతే విధివిధానాలు ఖరారు చేసి నిర్ణయం తీసుకుంటాం. శాస్త్రీయ పద్ధతిలో వీటిని హేతుబద్ధీకరించాలనేది ప్రభుత్వ నిర్ణయం. ఇందుకోసం ప్రత్యేకంగా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఆధ్వర్యంలో కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇందులో రెవెన్యూ అధికారులతో పాటు సంబంధిత అధికారులంతా సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆర్నెల్లు పర్యటించి ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. ఒక నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటాం. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి విధివిధానాలు ఖరారు చేస్తాం' అని రేవంత్ తెలిపారు.

**సగటు మధ్య తరగతి ఉద్యోగి సంసారంలా..**

'రాష్ట్ర ప్రభుత్వంలో 10.5 లక్షల మంది ఉద్యోగుల సైన్యం ఉంది. సీఎం, మంత్రులు, ప్రజా ప్రతినిధులు కేవలం నిర్ణయాలు మాత్రమే తీసుకుంటారు. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపైనే ఉంటుంది. ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల కలయికే ప్రభుత్వం. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికీ వస్తుంది. ఆ రోజున తనకు అందాల్సిన ఆర్థిక లబ్ధి తీసుకోవడం అతని హక్కు. కానీ గత ప్రభుత్వం చేతకాక వయో పరిమితిని పెంచింది. అందువల్ల ఆ సమయంలో జరగాల్సిన రిటైర్మెంట్లు ఇప్పుడు జరుగుతున్నాయి. ఉద్యోగులకు గత ప్రభుత్వం రూ.11 వేల కోట్ల మేర బకాయి పెట్టింది. అలాగే కాంట్రాక్టర్ల బిల్లులకు రూ.42 వేల కోట్లు..ఇలా అన్నీ కలిపి రూ.1.11 లక్షల కోట్లు గత ప్రభుత్వం నుంచి ఈ ప్రభుత్వానికి అప్పులు సంక్రమించాయి. ప్రస్తుతం క్రమ పద్ధతిలో పొదుపు చేస్తూ సగటు మధ్యతరగతి ఉద్యోగి సంసారం మాదిరి రెండేళ్లుగా శ్రమిస్తూ ఆర్థిక స్థితిని గాడిన పెడుతున్నాం. గతంలో ఉద్యోగులకు ఏ రోజున జీతాలు వచ్చాయి.. ఇప్పటి పరిస్థితి ఏమిటో సమీక్షించుకోవాలి.

**ఉద్యోగులకు పెద్దన్నగా ఓ తీపి కబురు**

ఉద్యోగులకు పెద్దన్న మాదిరిగా ఇక్కడికి వచ్చా. తీపి కబురు చెప్పకుండా ఉండడం సబబు కాదు. ప్రభుత్వ ఉద్యోగుల డీఏ ఫైలుపై సంతకం చేసి వచ్చా. ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు రూపొందిస్తున్నాం. రూ.1.02 కోట్ల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం. ఉద్యోగులు పన్నుల వసూళ్లు, ఇతర ఆదాయం విషయంలో మరింత కృషి చేస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత వేగంగా గాడిన పడుతుంది. ఉద్యోగ సంఘ భవనం ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ముందుగా హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యాలయం నిర్మించుకోవాలి. ఉద్యోగ సంఘం ఎంత నిధి ఇస్తుందో.. అదే స్థాయిలో ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుంది..' అని సీఎం చెప్పారు. టీజీవో అధ్యక్ష కార్యదర్శులు ఏలూరు శ్రీనివాసరావు, బి.శ్యామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఏలూరు.. సచివాలయంలో విలేకరులకు తెలిపారు. పెండింగ్ బిల్లుల కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.700 కోట్లను ఏప్రిల్ నుంచి రూ.1,500 కోట్లకు పెంచుతామని చెప్పారన్నారు. ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్న సీఎం, మంత్రులకు టీజీవో తరపున ధన్యవాదాలు తెలిపారు.



# కక్ష్య చేరని 'అన్వేష'ణ



**నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 10:17 గంటలకు కౌంట్‌డౌన్ ముగియగా, 10:18:30 గంటలకు పీఎస్‌ఎల్‌వీ-సీ62 రాకెట్ ఇక్కడి మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. మొదటి రెండు దశలు విజయవంతంగా పూర్తి కావడంతో శాస్త్రవేత్తల్లో ఉత్సాహం కనిపించింది. మూడోదశ (పీఎస్ 3) ముగిసి, నాలుగోదశ (పీఎస్ 4) ప్రారంభం కావాల్సిన కీలక సమయంలో అవాంతరం ఎదురైంది. రాకెట్ తన నిర్ణీత మార్గం నుంచి పక్కకు జరగడంతో నియంత్రణ కోల్పోయింది. చివరకు 16 ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టలేక మిషన్ విఫలమైంది.**

**విశ్లేషిస్తున్నాం: ఇస్రో ఛైర్మన్ నారాయణన్**

**ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ అధికారికంగా ప్రకటించారు. 'మూడోదశ ముగిసే వరకు రాకెట్ పనితీరు సాధారణంగానే ఉంది. అప్పుడే తలెత్తిన సాంకేతిక లోపం వల్ల వాహక నౌక కక్ష్యలోకి చేరుకోలేకపోయింది. ఈ వైఫల్యానికి కచ్చితమైన కారణాలను విశ్లేషిస్తున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం' అని ఆయన పేర్కొన్నారు.**

# వ్యూహాత్మక సుస్థిరత సాధిద్దాం





మొదటి పేజీ తరువాయి

రక్షణ పారిశ్రామిక సహకారం, ఉన్నత విద్యారంగంలో మరింత మెరుగైన సహకారం సహా 19 అంశాలపై రెండు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. పూర్తిస్థాయిలో వాణిజ్యానికి బాటలుపడేలా భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా సాకారం చేసుకోవాలని మోదీ, మెర్జ్‌లు అభిలంచారు. విదేశాలకు విమానాల్లో ప్రయాణించే భారతీయులు జర్మనీ మీదుగా వెళ్తున్నప్పుడు అవసరమయ్యే ట్రాన్సిట్ వీసాతో పనిలేకుండా వీసారహిత ప్రయాణాలకు అనుమతించాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. దీంతో భారతీయుల అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం కానున్నాయి.

**పెరిగిన సహకారమే పరస్పర విశ్వాసానికి ప్రతీక**

సంయుక్త ప్రకటన వేళ మోదీ మాట్లాడారు. ''రక్షణ, భద్రత రంగాల్లో ఏటికేడు పెరుగుతున్న సహకారమే ఇరుదేశాల మధ్య పరస్పర విశ్వాసం, ఐక్య దార్శనికతకు ప్రబల నిదర్శనం. వాణిజ్య ఒప్పందం సాఫీగా సాగేలా పూర్తి స్థాయి సహాయసహకారాలు అందిస్తున్న చాన్స్‌లర్ మెర్జ్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇరు దేశాల రక్షణ పరిశ్రమల మధ్య సహకారం బలపడేలా మార్గసూచీ కోసం కలిసి పనిచేద్దాం. దీంతో సహఅభివృద్ధి, సహ ఉత్పత్తిలో కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి''అని మోదీ అన్నారు. ''పారదర్శకమైన, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ వాణిజ్యానికి కట్టుబడి ఉన్నాం. సముద్ర చట్టాలపై ఐక్యరాజ్యసమితి తీర్మానాలను గౌరవిస్తాం. నూతన ద్వైపాక్షిక ఇండో-పసిఫిక్ సంప్రదింపుల వ్యవస్థను ప్రారంభిస్తున్నాం. ఇండియా-పశ్చిమాసియా-యూరప్ ఆర్థిక నడువాకు మా మద్దతు కొనసాగుతుంది''అని ఇరునేతలు సంయుక్త ప్రకటనలో స్పష్టంచేశారు. ఇండో-పసిఫిక్ సముద్రజలాల్లో చైనా ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్, జర్మనీ ఈ నిర్ణయానికొచ్చాయి.

**నైపుణ్య కార్మికులకెంతో డిమాండ్**

ఈ సందర్భంగా చాన్స్‌లర్ మెర్జ్ మాట్లాడారు. ''ఇరు దేశాల ప్రజల మధ్య సత్సంబంధాలు బలపడుతున్నాయి. భారత్ నుంచి ఏటా నైపుణ్య కార్మికులు, సహాయకులు, నర్సుల డిమాండ్ పెరుగుతోంది. భారత్‌లోని ఆరోగ్య సంరక్షణ వృత్తినిపుణులకు జర్మనీలో ఎంతో గిరాకీ ఉంది. అయితే సరఫరా వ్యవస్థలు, ముడి పదార్థాల తరలింపులో బడా శక్తుల జోక్యం పెరిగిపోయింది. దీనిని భారత్, జర్మనీ ఉమ్మడిగా ఎదుర్కోనున్నాయి''అని మెర్జ్ పరోక్షంగా చైనా, అమెరికాలను విమర్శించారు. ''జర్మనీ విశ్వవిద్యాలయాలకు ఇదే నా స్వాగతం. భారత్‌లోకి అడుగుపెట్టి మీ వర్సిటీల క్యాంపస్‌లను ఆరంభించండి. ప్రతిభావంతులైన భారతీయ యువత మీ జర్మనీ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి కృషిచేస్తోంది. సమగ్ర మార్గసూచీ అనేది విద్యారంగంలో భాగస్వామ్యాన్ని సమున్నత శిఖరాలకు చేర్చుతుంది'అని మోదీ అన్నారు.

# నీటి హక్కుల సాధనకు అన్ని స్థాయుల్లో పోరాటం



'కృష్ణా, గోదావరి జలాల్లో ప్రతి నీటిబొట్టునూ కాపాడుకోవడానికి అన్ని స్థాయుల్లో పోరాటం కొనసాగిస్తున్నాం. ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పుడు ఏం చెబుతున్నా ఏపీ ప్రభుత్వం పాలమూరురంగారెడ్డి పథకంతోపాటు కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణకు చెందిన ప్రాజెక్టులపైనా అభ్యంతరాలు వ్యక్తంచేసింది. వారు చెప్పిన దానికి చేసే దానికి తేడా ఉంది' అని ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రతిపాదిత పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ తెలంగాణ దాఖలు చేసిన రిట్‌పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ ముగిసిన అనంతరం దిల్లీలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... ''ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్ కాకుండా ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ వేయండని సుప్రీంకోర్టు సూచించింది. దాని ప్రకారం మేం తక్షణం సివిల్ సూట్ వేయనున్నాం. మా న్యాయవాది సింఘ్వీ గత సోమవారం సమర్పించిన వాదనలకు అదనంగా ఈ సోమవారం మరికొన్ని వాదనలను కోర్టుకు సమర్పించారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదించిన దానికి భిన్నంగా ఆంధ్రప్రదేశ్ అనేక ఉల్లంఘనలకు పాల్పడిందని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చాం. ఆనాడు పర్యావరణ, అటవీ శాఖ జారీ చేసిన స్టాప్‌వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదనీ చెప్పాం. గోదావరిలో కేటాయించిన 484.5 టీఎంసీల కంటే ఎక్కువ ఉపయోగించుకోవడానికి మౌలిక వసతులను సమకూర్చుకుంటోందని తెలిపాం. పోలవరంనల్లమలసాగర్ ప్రీ ఫీజిబిలిటీ నివేదికకు సీడబ్ల్యూసీ సూత్రప్రాయంగా ఆమోదం తెలపకున్నా... డీపీఆర్ తయారీకి ముందుకెళ్తున్నందున వారి ప్రయత్నాలను పూర్తిగా ఆపాలని కోరాం. విభజన చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టులో ఎలాంటి మార్పులు చేసినా పర్యావరణ అనుమతులతోపాటు అవసరమైన ఇతరత్రా అనుమతులను కోరే అర్హత కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందనీ... ఆంధ్రప్రదేశ్‌కు అందులో ఎలాంటి మార్పులు చేసే అధికారం లేదని వివరించాం. గోదావరి జలవివాద ట్రైబ్యునల్ ఆమోదించిన, 2009లో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంగీకరించిన 95 టీఎంసీల వరకే పోలవరం ప్రాజెక్టుకు తెలంగాణ అనుమతిచ్చినట్లు భావించాల్సి ఉంటుంది... తప్పితే అనధికారిక విస్తరణకు అంగీకరించినట్లుకాదని స్పష్టం చేశాం. పోలవరంలో సీడబ్ల్యూసీ జారీచేసిన అనేక మార్గదర్శకాలను ఏపీ ప్రభుత్వం ఉల్లంఘించినట్లు కోర్టు దృష్టికి తెచ్చాం'' అని వివరించారు.

## పోలవరం-నల్లమలసాగర్‌పై...
# రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదు

మొదటి పేజీ తరువాయి

ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. ''ప్రాథమికంగా ఈ రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేకపోవడంతో దానిపై విచారణను ముగిస్తున్నాం. అదే సమయంలో ఈ పిటిషన్‌లో పేర్కొన్న అన్ని అంశాలపై చట్ట ప్రకారం తగిన పరిష్కారాలు ఎంచుకోవడానికి పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తున్నాం'' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పిటిషన్‌పై ఈ నెల 5న విచారించినప్పుడే సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దాని విచారణార్హతపై అనుమానం వ్యక్తంచేసింది.కావాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించింది. ఆ సూచనను పరిశీలించి అభిప్రాయం చెప్పడానికి వారం రోజుల గడువు ఇవ్వాలని తెలంగాణ తరపు న్యాయవాది అభిషేక్‌సింఘ్వీ కోరడంతో ధర్మాసనం కేసు విచారణను 12వ తేదీకి వాయిదా వేసింది. దాని ప్రకారం సోమవారం విచారణ ప్రారంభమైన వెంటనే అభిషేక్‌సింఘ్వీ జోక్యం చేసుకుంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌ను ఆర్టికల్ 32కింద విచారణకు స్వీకరించవచ్చని ధర్మాసనానికి విన్నవిస్తూ సంబంధిత వాదనలను లిఖితపూర్వకంగా సమర్పించారు. తమ నోట్‌ను పరిశీలించాక మీరు ఏ అభిప్రాయం వ్యక్తంచేస్తే దాని ప్రకారం నడుచుకుంటామని విన్నవించారు.

''ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్‌ను ఎందుకు విచారణకు స్వీకరించాలన్న కారణాలను ఇందులో వివరించాం. గోదావరి ట్రైబ్యునల్ 197980లో ఆవిరయ్యే నీటితో కలిపి ఏపీకి అభిషేక్‌సింఘ్వీ బదులిస్తూ అది తమ వాదనల్లో ఒక భాగం మాత్రమేనని, మొత్తంగా ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్‌కు విచారణార్హత ఉందన్నదే తమ ప్రధాన అభిప్రాయమన్నారు. కేంద్ర జలసంఘం 2017, 2025లలో జారీ చేసిన మార్గదర్శకాలను ఆంధ్రప్రదేశ్ పూర్తిగా ఉల్లంఘిస్తోందన్నారు. సివిల్‌సూట్‌లో చాలా పరిమితులు ఉంటాయన్నారు.అందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ ''సివిల్ సూట్‌కు విస్తృతి ఎక్కువగా ఉంటుంది. అక్కడ సాక్ష్యాధారాలను లోతుగా పరిశీలించవచ్చు'' అని అన్నారు. జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి జోక్యం చేసుకుంటూ ''గోదావరి ట్రైబ్యునల్ అవార్డులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకలూ వస్తాయి. మీ రిట్ పిటిషన్‌లో అవి పార్టీలుగా లేవు. సివిల్ సూట్‌లో ఇలాంటి వాటన్నింటినీ సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోవడానికి వీలవుతుంది'' అని పేర్కొన్నారు.దాంతో ''ఇప్పుడు మేం ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకొని, వెంటనే సివిల్ సూట్ దాఖలు చేస్తాం. అది ఇప్పటికే దాదాపు తయారైంది. సూట్‌పైనా ప్రతివాదులు సాంకేతిక కారణాలతో అభ్యంతరాలు వ్యక్తంచేస్తే న్యాయమూర్తులే దాఖలు చేయాలని సూచించారంటూ మేం చెబుతాం. ఎందుకంటే మేం అన్నిచోట్లా పరిష్కారాలు లేనివారీగా మిగిలిపోలేం'' అంటూ సింఘ్వీ విన్నవించారు. జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ పిటిషన్‌కు విచారణార్హత లేదని ప్రతివాదులు వ్యక్తంచేసిన అభ్యంతరంపై ఇక్కడ విన్నట్లుగానే అక్కడా వినాల్సి ఉంటుందన్నారు. అభ్యంతరాలు వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉంటుందన్నారు.అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ... అలాగైతే



484.5 టీఎంసీలు కేటాయించింది. వరద నీరనో, ఇంకో పేరో చెప్పి అంతకుమించి నీటిని మళ్లించడానికి ప్రయత్నిస్తే అది చట్టవిరుద్ధమవుతుంది. అప్పుడు ఆర్టికల్ 32కింద జోక్యం చేసుకోవడానికి కోర్టుకు అధికారం ఉంటుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిన టీఎంసీలకు మించి నీటిని వాడుకోవడానికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చుకుంటోంది. ఇవన్నీ ఆర్టికల్ 32కిందికి వచ్చే అంశాలే. అలాగే విభజన చట్టంలోని సెక్షన్ 84(3)(ఐఐ), 85(8)(డి)లను ఏపీ బహిరంగంగా ఉల్లంఘిస్తోంది. ఆంధ్రప్రదేశ్ చేపట్టే ప్రాజెక్టులు అంతర్రాష్ట్ర అంశాలపై ప్రభావం చూపేట్లయితే తప్పనిసరిగా జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ, జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ఎపెక్స్ కౌన్సిల్, కేంద్ర పర్యావరణ అటవీశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని ఈ సెక్షన్లు చెబుతున్నాయి'' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.అప్పుడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ ''మీరు ఈ సెక్షన్లలోని అంశాలను సవాల్ చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్ కొన్ని చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తోందని చెప్పడానికి మాత్రమే ఈ సెక్షన్లను ఉదాహరణగా చూపుతున్నారు. చట్ట ప్రకారం కేటాయించిన నీటికి మించి వాడుకోవడానికి ఏపీ ప్రయత్నిస్తోందని చెబుతున్నారు కదా'' అని ప్రశ్నించారు. అందుకు కోర్టు సూచన మేరకు మేం ఉపసంహరించుకుంటున్నామని, తర్వాత సివిల్‌సూట్ దాఖలు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. ఆ వినతిపై ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం వ్యక్తంచేశారు. కోర్టు చెప్పడంతోనే సివిల్ సూట్ దాఖలు చేశామని వారు ముందస్తు ఉత్తర్వులు (అడ్వాన్స్ రూలింగ్) కోరుతున్నారని, అలా చేయకూడదన్నారు. అందుకు జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ తాము ఎవరివైపూ ఎలాంటి అడ్వాన్స్ రూలింగ్ ఇవ్వడంలేదని నవ్వుతూ అన్నారు. సింఘ్వీ జోక్యం చేసుకుంటూ అలాగైతే ఎలాంటి అభిప్రాయాలూ వ్యక్తం చేయకుండా పిటిషన్ ఉపసంహరించుకోవడానికి తమకు అనుమతివ్వాలని ధర్మాసనానికి విన్నవించారు. ఇందులో సున్నితాంశాలు ఇమిడి ఉన్నందున డిస్మిస్ చేసినట్లు పేర్కొనవద్దని కోరారు.

జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ ''పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లుగా భావిస్తూ డిస్మిస్ చేస్తున్నాం (డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్). అయితే పిటిషనర్ రాష్ట్రం తగిన పరిష్కారాలు అందుకోవడానికి చట్టప్రకారం అన్ని వివాదాస్పద అంశాలు ప్రస్తావించడానికి స్వేచ్ఛనిస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఉత్తరుల్లో పేర్కొన్న డిస్మిస్డ్ అన్న పదాన్ని తొలగించి డిస్పోజ్డ్ ఆఫ్ అని చేర్చాలని సింఘ్వీ విన్నవించగా... అందుకు ప్రధాన న్యాయమూర్తి అంగీకరించారు.

## నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న భవనంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం

ఈ-కబురు, శేరిలింగంపల్లి : గొలుసు కట్టు నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా అనుమతులు మంజూరు చేసిన జిహెచ్ఎంసి అధికారులను సస్పెండ్ చేయాలని శేరిలింగంపల్లి సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిహెచ్ఎంసి కమిషనర్ కు శేరిలింగంపల్లి సిపిఎం కార్యదర్శి చల్లా శోభన్, కార్యవర్గ సభ్యులు మాణిక్యం, కే కృష్ణ, వరుణ్ లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చల్లా శోభన్ మాట్లాడుతూ మియాపూర్ సర్కిల్ పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ దగ్గరలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. అక్కడ నాలా ఉందని తెలిసి, ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా పర్మిషన్ ఇచ్చిన అధికారులపై శాఖ పరమైన దర్యాప్తు జరపాలని, ఇచ్చిన పర్మిషన్స్ ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఒక చెరువు నుంచి మరో చెరువుకు వరద నీటిని తరలించే గొలుసుకట్టు నాలాను ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టడం అన్యాయం అన్నారు. నాలా ఆక్రమణతో వర్షా కాలంలో వరదలు వచ్చి చుట్టుపక్కల కాలనీలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలోనే అనేకసార్లు వరదలు వచ్చి కాలనీలు మునిగిపోయిన పరిస్థితి శేరిలింగంపల్లిలో చూశామని గుర్తుచేశారు. గంగారం చెరువు నుండి చందానగర్ మీదుగా అమీన్పూర్ లోకి వెళ్లే గొలుసుకట్ట నాలాను పూర్తిగా కబ్జా చేసి, రెవెన్యూ, ఇరిగేషన్, జిహెచ్ఎంసి అధికారులను మభ్యపెట్టి అక్రమంగా అనుమతులు తీసుకొని భారీ భవనం నిర్మిస్తున్నారని తెలిపారు. సదరు భవనానికి ఎలాంటి దారి లేకపోవడంతో నిర్మాణదారుడు నాలాపైన అక్రమంగా స్లాబ్ వేసి దాన్ని దారిగా చూయించి అనుమతులు తీసుకున్నారన్నారు. వరద నీటిని తరలించే నాలా కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ మొత్తం తతంగం పైన విచారణ జరిపి భవన అనుమతులు రద్దు చేయాలని నాలాపూడ్చి వేత పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మమత వీరంగం



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చౌర్యానికి పాల్పడ్డారని, వారి దుశ్చర్యలకు సీబీఐ విచారణతో అడ్డుకట్టవేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) సోమవారం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఐప్యాక్ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసం మీద ఈడీ దాడి చేయగానే, మమత పరుగుపరుగున వచ్చి, కొన్ని ఫైళ్ళను లాక్కుపోయిన పరిణామాల మీద సీబీఐ విచారణ జరపాలని న్యాయస్థానాలను ఈడీ డిమాండ్ చేస్తోంది. కోల్‌కతా హైకోర్టులో శుక్రవారం ఈడీ పిటిషన్ విచారణకు రాకుండా తృణమూల్ పార్టీ కోర్టులో తీవ్ర గందరగోళం సృష్టించి కుట్రచేసిందని కూడా సుప్రీంకోర్టుకు ఆ సంస్థ ఫిర్యాదుచేసింది. ఉద్రిక్తత, గందరగోళం మధ్యన పిటిషన్ల విచారణ సాధ్యం కాని స్థితిలో కోల్‌కతా హైకోర్టు దానిని 14వ తేదీకి వాయిదావేయడంతో సుప్రీంకోర్టును ఈడీ శరణుజొచ్చింది. వద్దువద్దని వారించినా, మా పనిలో జోక్యం మీకు తగదనీ, అది తప్పనీ హితవుచెప్పినా ప్రతీక్‌జైన్ ఇంట్లోకి మమత చొరబడ్డారని, తమ బృందానికి నాయకత్వం వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారినుంచి కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు, కీలక డాక్యుమెంట్లు ఆమె లాక్కుపోయారని ఈడీ ఆరోపణ. తాము సోదాలు జరిపిన ప్రాంగణం నుంచి ఆమె ఎత్తుకెళ్ళిన అన్ని రికార్డులను, ఆధారాలను వెంటనే సీజ్ చేయించి, ఫోరెన్సిక్ ప్రిజర్వేషన్‌కు ఆదేశించాలని సుప్రీంకోర్టును ఈడీ కోరింది.

ఎన్నికలు దగ్గరపడుతున్న పశ్చిమబెంగాల్‌లో రాబోయేరోజుల్లో ఇటువంటి దృశ్యాలు, ఇంతకంటే నాటుగా ఉండబోయేవి కూడా అనేకం చూడబోతున్నాం. బొగ్గుకుంభకోణంలో మనీలాండరింగ్ కేసు-మరింత లోతైన దర్యాప్తు పేరిట పశ్చిమబెంగాల్లో, అదీ తన పార్టీ రాజకీయవ్యూహాలను తయారుచేసే కన్సల్టెన్సీలో ఈడీ కాలూనితే వీధిపోరాటాలకు మారుపేరైన మమత వీరంగం వేయకుండా ఉంటారా? పార్టీ కార్యకర్తలను, పోలీసు బలగాలను వెంటబెట్టుకొనిపోయి సోదాలు జరుగుతున్న ప్రదేశంలోకి స్వయంగా చొరబడి ఈడీ అధికారుల నుంచి ఫైళ్ళు లాక్కోవడం ఆమెకు తప్పు అనిపించలేదు. తృణమూల్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే సమాచారాన్నీ, రేపటి ఎన్నికల వ్యూహాలూ విజయ రహస్యాలనూ ఎత్తుకుపోవడమే ఈ దాడి అసలు లక్ష్యం కనుక, ఆ పార్టీ అధినేతగా ఈడీ దొంగిలించిన సమాచారాన్ని రక్షించుకోవడం, తిరిగి స్వాధీనం చేసుకోవడం తప్పెలా అవుతుందని ఆమె ప్రశ్న. ఢిల్లీ, కోల్‌కతాల్లో నిరసనలు, దీక్షలతోపాటు, ఈడీ అధికారులపై బెంగాల్ పోలీసులు ఏకంగా కేసులు నమోదుచేయడం... పోరు నష్టం కాదు, రాజకీయంగా లాభమేనన్న ఆమె నమ్మకానికి నిదర్శనం.శారదా చిట్‌ఫండ్స్ కుంభకోణాన్ని దర్యాప్తు చేసిన ఒక ఉన్నతస్థాయి పోలీసు అధికారిని కాపాడుకోవడం కోసం 2019లో మమత ఏకంగా రోడ్డుమీద నిరసనకు కూర్చున్న దృశ్యాలు ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తున్నాయి. కోల్‌కతా పోలీసు చీఫ్ రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయడానికి నలభైమంది సీబీఐ అధికారులు వస్తే, కొందరిని పోలీసు స్టేషన్‌కు తరలించి, మిగతావారిని కదలనివ్వకుండా చేశారామె. స్థానిక సీబీఐ కార్యాలయాన్ని రాష్ట్ర పోలీసులు చుట్టుముట్టి సోదాలు చేయడం, ప్రతిగా కేంద్ర బలగాలు అక్కడకు చేరుకోవడం వంటి దృశ్యాలు అంతవరకూ ఎవరూ చూడనివి, ఊహకు సైతం అందనివి. కోర్టు ఆదేశాలు లేకున్నా సీబీఐని మోదీ ప్రయోగించడం సరైనదే అయితే, నా ప్రతిచర్యలు కూడా సముచితమైనవేనని మమత సమర్థించుకున్నారు. మమత చర్యలు, చేష్టలూ రాజ్యాంగబద్ధం కావన్న వాదన అటుంచితే, బీజేపీ పెద్దలకు దర్యాప్తులు సక్రమంగా సాగడం కంటే, విపక్షనేతలను రాజకీయంగా దెబ్బతీయడం, వాటి నుంచి తాము లబ్ధిపొందడం ముఖ్యమైపోవడంతో ఇటువంటి దృశ్యాలు చూడవలసి వస్తున్నది.

**అనేక ఏళ్ళనాటి ఈ కేసులో సరిగ్గా ఎన్నికల ముందు కేంద్రం దాడులు, అరెస్టులకు ఉపక్రమించడం తప్పడు సందేశాన్ని ఇస్తుంది. పదిహేనేళ్ళుగా అధికారం కోసం అర్రులు చాస్తూ, ఒక్కోమెట్టూ ఎక్కుతూ వచ్చిన బీజేపీ ఈమారు రాష్ట్రాన్ని గెలిచితీరాలన్న పట్టుదలతో పోరాడుతోంది. సదరు కన్సల్టెన్సీ సంస్థ నుంచి తృణమూల్ ఎన్నికల వ్యూహాలను తాము తస్కరించలేదన్న ఈడీ వాదన నిజమే అనుకున్నా, సోదాలు జరపడానికి అది ఎంచుకున్న సమయం వల్ల సామాన్యుడికి నమ్మకం కలగదు. ఇక, ఈ తరహా కేసులేవీ తీర్పులవరకూ, శిక్షలవరకూ రాకుండా కేవలం రాజకీయానికి ఉపకరించడమే చూస్తున్నాం. రాజకీయవైరాల మధ్య దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థలకూ, రాష్ట్ర పోలీసు యంత్రాంగాలకూ మధ్య ఘర్షణలు రేగడం సముచితం కాదు.**

## ఏడాదిలో లక్ష వీసాల రద్దు.. ట్రంప్ సర్కారు దూకుడు

ఏడాదిలో లక్ష వీసాలను రద్దు చేయడం రికార్డని అధికారులు తెలిపారు. వీసాల రద్దుకు నాలుగు ప్రధాన కారణాలున్నాయి. అందులో గడువును మించి అమెరికాలో ఉండటం, మద్యం తాగి వాహనాలు నడపడం, దాడులు చేయడం, దొంగతనాలకు పాల్పడటం వంటివి ఉన్నాయి. 2024తో పోలిస్తే వీసాల రద్దు 150శాతానికిపైగా పెరిగింది. ప్రస్తుతం అన్ని వీసాలపై సోషల్ మీడియా వెట్టింగ్ చేస్తున్నామని విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

**: వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే**

న్యూయార్క్: వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. తన సొంత సోషల్ మీడియా వేదిక.. 'ట్రూత్ సోషల్'లో ఆయన తన ఫొటోను ఉంచి.. దానిపై 'వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు' అని క్యాప్షన్ పెట్టారు. జనవరి 2026 నుంచి తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో అమెరికా 45వ, 47వ అధ్యక్షుడిగానూ డెజిగ్నేషన్ ఉంది. ఈ నెల మొదట్లో వెనెజువెలాపై దాడిచేసి అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించి అమెరికాకు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే వెనెజువెలాను తామే నడుపుతామని ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు చేపట్టారు.



## 'వీబీజీ రామ్ జీ'పై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం

హైదరాబాద్: 'వీబీజీ రామ్ జీ' చట్టంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఈ కొత్త చట్టం అమలుతో తెలంగాణకు కేంద్రం అదనంగా రూ.340 కోట్లు ఇవ్వనుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మోదీ ప్రధాని అయ్యాక అనేక పథకాల్లో సంస్కరణలు తీసుకొచ్చారు. జీఎస్టీ పన్ను విధానాన్ని సులభతరం చేశారు. తాజాగా ఉపాధి హామీ చట్టానికి సాంకేతికతతో మెరుగులు దిద్ది, పని దినాలు పెంచాలనే ప్రయత్నం చేస్తున్నారు. కూలీల పనిదినాలు 100 నుంచి 125 రోజులకు పెరగనున్నాయి. అడిగిన ప్రతి కూలీకి తప్పనిసరిగా పని కల్పించాల్సిందే. ఏ కారణంతోనైనా కల్పించలేకపోతే వారికి పరిహారం చెల్లించాలనే నిబంధనను చట్టంలో పొందుపరిచాం. అలాగే కూలి సకాలంలో జమకాకపోతే, బాధ్యులకు జరిమానా విధించే విధానం కూడా ఉంది. తాజా సంస్కరణలతో రాష్ట్రాలపై అదనపు భారం పడుతుందని అంటున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం కూడా అదనపు భారం మోస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.17 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయబోతోంది. తెలంగాణకూ గతేడాది కంటే అదనపు నిధులు అందనున్నాయి. గతంలో దళారులు, రాజకీయ నాయకులు ఈ పథకం పేరుతో భారీగా దోపిడీ చేసేవారు. దానిని అరికట్టేందుకు డిజిటల్ లావాదేవీల ద్వారా చెల్లింపులు చేపట్టనున్నాం. పథకాల పేర్లకన్నా అమలే ముఖ్యం. వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజనను మేమే ప్రారంభించాం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దాని పేరు మార్చింది. బేగంపేట విమానాశ్రయం ఎన్టీఆర్ పేరుతో ఉండేది. తర్వాత రాజీవ్‌గాంధీ పేరుతో కాంగ్రెస్ మార్చలేదా? యూపీఏ హయాంలో జరిగిన కోల్ స్కామ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు కోల్‌బ్లాక్స్, మైనింగ్ బ్లాక్స్ అన్నీ వేలం ద్వారా పారదర్శకంగా కేటాయిస్తున్నాం. రాబోయే మూడేళ్లలో అనేక రంగాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొస్తాం' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో భాజపా ఎంపీల విజయం గాలివాటం అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. 'రాష్ట్రంలో భారాస పని అయిపోయింది. భాజపా విజయం గాలివాటం ఎలా అవుతుంది? దేశంలో మూడుసార్లు అధికారంలోకి రావడం గాలివాటమా? పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్రం అడగడంలో తప్పేమీ లేదు. మేడారం జాతరకు గతంలో నేను కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం నిధులు వచ్చేలా కృషి చేశాను. ఈసారి కూడా జాతరకు నిధులిస్తాం' అని వెల్లడించారు.

**ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు**

అంతకుముందు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ యువజన దినోత్సవం వేడుకల్లో కిషన్‌రెడ్డి పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, నాయకులు ఎన్.గౌతంరావు వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద : కసిరెడ్డి భాస్కరరెడ్డి



స్వామి వివేకానంద కు నివాళులు అర్పిస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు

ఈకబురు, శేరిలింగంపల్లి : భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని బిజెపి రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం చందానగర్ గౌతమీ నగర్ మున్సిపల్ పార్కులోని వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... వివేకానంద ఆశయాలకు అనుగుణంగా ఆయన చెప్పిన మార్గాన యువత నడవాలని పిలుపునిచ్చారు. బాలగంగాధర్ తిలక్, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, శ్రీఅరబిందో సహా అనేక మంది స్వాతంత్ర్యవీరులకు స్వామి వివేకానంద స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. వివేకానంద సాహిత్యం చదివాక తనలో దేశభక్తి వెయ్యిరెట్లు పెరిగిందని మహాత్మాగాంధీ చెప్పారని గుర్తు చేశారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె సురేందర్, కార్యదర్శి ఆదిశేషయ్య, నూకల తనవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క జిల్లాను ముట్టుకున్నా.. ఉద్యమమే



ఒక్క జిల్లాను ముట్టుకున్నా అక్కడ ఉద్యమం చేస్తాం' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఎంబీసీ మైదానంలో మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో భారాస మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల ఆత్మీయ అభినందన సభ నిర్వహించి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. 'ప్రజల వద్దకు అధికారుల్ని తీసుకురావాలని కేసీఆర్ హయాంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటుచేశాం.. తండాలను పంచాయతీలుగా మార్చాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం..వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలను తొలగించాలని చూస్తోంది. అలాచేస్తే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతాం.

**పాలమూరును ఎండబెట్టారు**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు రూ.30,000 కోట్లతో 90 శాతం పూర్తి చేశాం. మిగిలిన 10 శాతం పనులు చేయకుండా రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. పూర్తిచేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని, పాతబాసుకు కోపమొస్తుందని పాలమూరును రేవంత్‌రెడ్డి ఎండబెడుతున్నారు. యూరియా బస్తా ఇవ్వలేని వారు, పాలమూరును సస్యశ్యామలం చేస్తామంటూ మళ్లీ 17వ తేదీన ఇక్కడికే వస్తున్నారు. మోసపుచ్చే మాటలు చెప్తారు నమ్మకండి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు నెరవేరుస్తామని గొప్పలు చెప్పారు. మొత్తం 420 హామీలిచ్చారు. ఏవీ అమలు కావడం లేదు. కేసీఆర్ హయాంలో బతుకమ్మ పండగకు ఆడపడుచులకు బతుకమ్మ చీరలు, రంజాన్ పండగకు రంజాన్ తోఫా ఇచ్చేది. క్రిస్మస్ నాడు క్రైస్తవులకు కానుకలు అందించేది. కేసీఆర్ కిట్, ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగపిల్లాడు పుడితే రూ.12 వేలు ఇచ్చేవాళ్లం. ఇప్పుడవన్నీ ఎత్తేశారు.

**మార్పు మొదలైంది**

భారాస హయాంలో పల్లె, పట్టణప్రగతి కింద అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేశాం. కాంగ్రెస్ హయాంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉంది. రెండేళ్లు తిరగకముందే 40 శాతం సర్పంచి స్థానాలు భారాసకి ఇచ్చారంటే మార్పు మొదలైందని అర్థమవుతోంది. పంచాయతీ ఎన్నికలు నమూనా మాత్రమే. మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజల అసంతృప్తి ప్రతిఫలిస్తుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో భారాస తరఫున ఎవరు బరిలో నిలిచినా కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి' అని పిలుపునిచ్చారు. అంతకుముందు మహబూబ్‌నగర్‌లో భారాస శ్రేణులు కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించాయి. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బాల్యానాయక్, ఇంతియాజ్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది కచ్చితంగా ఏపీకి సహకరించడమే

**ఈ-కబురు, హైదరాబాద్: సుప్రీంకోర్టులో విచారణకు అర్హత లేని పిటిషన్ వేసి.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం-నల్లమలసాగర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని భారాస సీనియర్ నేత, అసెంబ్లీలో ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.**

"నాడు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. రేవంత్‌రెడ్డి.. మన నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేస్తున్నారు. రిట్ ఉపసంహరించుకొని.. సివిల్ సూట్ ఫైల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడమంటే.. పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమే. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తిచేసుకొని.. తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ.. అప్పనంగా నీళ్లను తరలించుకుపోతుంది. పంచాయితీలు.. న్యాయస్థానాలు వద్దు.. మనమే కూర్చొని చర్చించుకుందాం అని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల ఆంతర్యం ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమేనా మీ చర్చల లక్ష్యం? నీటి విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



గూగుల్ సెర్చ్ లో కొత్త సదుపాయం..

# వెతికిన చోటే షాపింగ్!




ఏదైనా వస్తువు కొనాలంటే దాని గురించి ఆరా తీసి, అది ఏ ఇ-కామర్స్ వెబ్‌సైట్‌లో దొరుకుతుందో వెతికి కొనుగోలు చేయడం చాలామందికి ఉన్న అలవాటు. మళ్లీ అక్కడ అడ్రస్ వివరాలు ఇచ్చి, చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇకపై వెతికిన చోటే కొనుగోలు చేసే విధంగా ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్.. కొత్త ఏఐషాపింగ్ టూల్‌ను లాంచ్ చేసింది. గూగుల్ సెర్చ్‌లోనే నేరుగా వస్తువులను కొనుగోలు చేసేందుకు ఈ టూల్ ఉపయోగపడుతుంది. వస్తువు ఎంపిక నుంచి కొనుగోలు వరకు అన్నీ అక్కడే పూర్తి చేయొచ్చన్నమాట.

ఏఐ మోడ్‌లో గూగుల్ సెర్చ్, జెమినై యాప్‌లో బ్రౌజింగ్ సమయంలో యూజర్లు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేయొచ్చు. దీనికి యూనివర్సల్ కామర్స్ ప్రోటోకాల్ (UCP) అని నామకరణం చేసింది. ఇందుకోసం షాపిఫై, వేఫెయిర్, టార్గెట్, వాల్‌మార్ట్ వంటి ఇ-కామర్స్ సంస్థలతో పాటు వీసా, మాస్టర్‌కార్డ్ వంటి సంస్థలతో గూగుల్ జట్టుకట్టింది. తొలుత అమెరికాలో ఈ సదుపాయాన్ని గూగుల్ తీసుకొచ్చింది. ఏదైనా ప్రొడక్ట్‌ను ఏఐ సెర్చ్ లేదా జెమినై యాప్‌లో సెర్చ్ చేసి.. అక్కడే గూగుల్ పే ద్వారా చెల్లింపులు చేయొచ్చు. గూగుల్ వాలెట్‌లో సేవ్ అయిన షిప్పింగ్ వివరాలు ఉపయోగించుకోవచ్చు. పేపాల్ వంటి ఇతర చెల్లింపు వ్యవస్థలను త్వరలో యాడ్ చేసే అవకాశం ఉంది. ఈ సదుపాయాన్ని ఇతర దేశాల్లోనూ గూగుల్ అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకోసం ప్రముఖ ఇ-కామర్స్ సంస్థలు, పేమెంట్ సంస్థలతో గూగుల్ జట్టుకట్టనుంది. లాయల్టీ రివార్డ్స్, కస్టమైజ్డ్ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ వంటి ఫీచర్లను భవిష్యత్‌లో జోడించే అవకాశం ఉంది.

# టీసీఎస్ లాభం రూ.10657 కోట్లు.. డబుల్ డివిడెండ్ ప్రకటించిన కంపెనీ

TCS Q3 Results | ఇంటర్నెట్ డెస్క్: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (TCS) సోమవారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికానికి (TCS Q3 Results) గానూ రూ.10,657 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.12,380 కోట్లతో పోలిస్తే నికరలాభం 14 శాతం క్షీణించింది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం మాత్రం గతేడాది నమోదైన రూ.63,973 కోట్లతో పోలిస్తే 5 శాతం వృద్ధితో రూ.66,087 కోట్లకు చేరింది.

అంతకుముందు త్రైమాసికంలో (Q2) రూ.12,075 కోట్లతో పోల్చినప్పుడు కూడా నికర లాభంలో 12 శాతం క్షీణత నమోదు కాగా.. ఆదాయం 2 శాతం మేర పెరిగింది. ఫలితాల సందర్భంగా కంపెనీ రెండు డివిడెండ్లు ప్రకటించింది. మూడో మధ్యంతర డివిడెండ్ కింద ఒక్కో షేరుకు రూ.11 చొప్పున చెల్లిస్తామని కంపెనీ వెల్లడించింది. అలాగే, స్పెషల్ డివిడెండ్ కింద ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.46 చొప్పున చెల్లించేందుకు టీసీఎస్ బోర్డు ఆమోదం తెలిపింది. జనవరి 17వ తేదీని రికార్డు తేదీగా ప్రకటించగా.. ఫిబ్రవరి 3వ తేదీన చెల్లింపులు చేస్తామని పేర్కొంది.

టీసీఎస్‌లో ఉద్యోగుల సంఖ్య క్షీణించింది. డిసెంబర్ నాటికి గడిచిన మూడు నెలల్లో ఉద్యోగుల సంఖ్య 11,151 మేర తగ్గినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు విలువ బీఎస్ఈలో 0.86 శాతం లాభంతో రూ.3235.70 వద్ద ముగిసింది.




# యూటర్న్ తీసుకుని సూచీలు రయ్ రయ్..
# గంటలో స్టాక్ మార్కెట్‌లో మారిన సీన్

ముంబయి: అమెరికా టారిఫ్ భయాలు.. విదేశీ మదుపర్ల అమ్మకాలతో ఉదయం భారీ నష్టాల్లో మొదలైన సూచీలు.. అనూహ్యంగా యూటర్న్ తీసుకున్నాయి. దాదాపు 700 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్.. 25,500 దిగువకు వెళ్లిన నిఫ్టీ.. మళ్లీ లాభాల బాట పట్టాయి. అదీ కేవలం గంట వ్యవధిలోనే. అంతలా మార్కెట్‌ను ప్రభావితం చేశారు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్. అంబాసిడర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు మార్కెట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

భారత్ అమెరికా కీలక భాగస్వాములని సెర్గియో వ్యాఖ్యానించారు. మిత్రులన్నాక అభిప్రాయ భేదాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనవరి 13న ఇరు దేశాల మధ్య తదుపరి దశ వాణిజ్య చర్చలు ఉంటాయని చేసిన వ్యాఖ్యలు మార్కెట్‌కు బూస్ట్ ఇచ్చాయి. దీంతోపాటు సిలికాన్ సరఫరా కోసం అమెరికా నేతృత్వంలో వ్యూహాత్మకంగా ఏర్పాటైన ప్యాక్స్‌సిలికాన్ కూటమిలోకి భారత్‌ను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొనడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో ఐదు రోజుల వరుస నష్టాల నుంచి మార్కెట్లు గట్టెక్కాయి. సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి దాదాపు 1100 పాయింట్ల మేర రికవర్ అయ్యింది.

సూచీల గమనం ఇలా..



సెన్సెక్స్ ఉదయం 83,435.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,576.24) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,861.07 వద్ద కనిష్ఠాన్ని తాకింది. సెర్గియో గోర్ ప్రకటన తర్వాత లాభాల బాట పట్టిన సూచీ.. ఇంట్రాడేలో 83,962.33 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 301.93 పాయింట్ల 83,878.17 వద్ద ముగిసింది. 25,473.40 వద్ద కనిష్ఠాన్ని తాకిన నిఫ్టీ.. ఇంట్రాడేలో 25,813.15 వద్ద గరిష్ఠానికి చేరుకుంది. చివరికి 106.95 పాయింట్ల లాభంతో 25,790.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్, ఎస్‌బీఐ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, బీఈఎల్, ఎల్అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.02 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు రికార్డు స్థాయిలో 4,589 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# రూ. 15వేలు కంటే తక్కువ ధరలో.. బెస్ట్ స్మార్ట్ ఫోన్‌లు



2026 మొదలైపోయింది.. సంక్రాంతి కూడా వచ్చేసింది. ఈ సమయంలో కొందరు ఓ మంచి స్మార్ట్‌ఫోన్ కొనాలని ఎదురు చూస్తుంటారు. ఇక్కడ ఈ కథనంలో రూ. 15వేలు కంటే తక్కువ ధరలు అందుబాటులో ఉన్న ఐదు బెస్ట్ స్మార్ట్‌ఫోన్‌ల గురించి తెలుసుకుందాం.

**పోకో ఎం7 ప్రో 5జీ**

రూ.13,499 ధర వద్ద లభించే ఈ 5జీ స్మార్ట్‌ఫోన్.. డ్యూయల్ 50MP కెమెరా 20MP సెల్ఫీ కెమెరా పొందుతుంది. ఇది మీడియా టెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా చిప్‌సెట్ పొందుతుంది. ఇది 120 Hz రిఫ్రెష్ రేట్, 2100 nits పీక్ బ్రైట్‌నెస్ & డాల్బీ విజన్‌తో 6.67 ఇంచెస్ AMOLED డిస్‌ప్లేను కలిగి ఉంది. 45W ఛార్జింగ్ సపోర్ట్‌తో 5110 mAh బ్యాటరీ ఇందులో చూడవచ్చు.

**ఒప్పో కే13ఎక్స్**

ఒప్పో కే13ఎక్స్ స్మార్ట్‌ఫోన్‌లో 50MP + 2MP డ్యూయల్ రియర్ కెమెరా & 8MP సెల్ఫీ కెమెరా ఉన్నాయి. మీడియా టెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్ ఉంటుంది. దీని ధర 12,499 రూపాయలు. ఇది 120 Hz రిఫ్రెష్ రేట్‌తో 6.67-అంగుళాల IPS LCD డిస్‌ప్లేను కలిగి ఉంది. ఇది 45W ఛార్జింగ్‌తో 6000 mAh బ్యాటరీతో వస్తుంది.

**రెడ్‌మీ 15సీ**

12,999 రూపాయల ఈ స్మార్ట్‌ఫోన్ రూ. 15వేలు కంటే తక్కువ ధరలో లభించే స్మార్ట్‌ఫోన్‌ల జాబితాలో ఒకటి. మీడియాటెక్ హెలియో జీ81 అల్ట్రాతో లభించే ఈ ఫోన్.. 8MP సెల్ఫీ కెమెరాతో డ్యూయల్ 50MP రియర్ కెమెరాను కలిగి ఉంది. ఇది 6.9 ఇంచెస్ IPS LCD & 120 Hz రిఫ్రెష్ రేట్‌ను కలిగి ఉంది. ఇది 33 W ఛార్జర్‌తో 6000 mAh బ్యాటరీతో లభిస్తుంది.

**వివో T4 లైట్ 5జీ**

వివో T4 లైట్ 5జీ మొబైల్.. 5MP సెల్ఫీ కెమెరాతో డ్యూయల్ 50MP వెనుక కెమెరాను కలిగి ఉంది. ఇది 90 Hz రిఫ్రెష్ రేట్‌తో 6.74-అంగుళాల IPS LCD డిస్‌ప్లేను కలిగి ఉంది. మీడియా టెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్ కలిగిన ఈ ఫోన్ ధర రూ. 14,999. ఇది 15 W ఛార్జర్‌తో 6000 mAh బ్యాటరీని పొందుతుంది.

**మోటరోలా జీ57 పవర్ 5జీ**

మోటరోలా G57 పవర్ 5జీ మొబైల్.. 6.72-అంగుళాల IPS LCD డిస్‌ప్లేతో.. 1050 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో 120 Hz రిఫ్రెష్ రేట్‌ను ప్రదర్శిస్తుంది. స్నాప్‌డ్రాగన్ 6s Gen 4 చిప్‌సెట్‌తో నడిచే ఈ ఫోన్ 7000 mAh బ్యాటరీతో లభిస్తుంది. ఇది 50MP + 8MP రియర్ కెమెరాను కలిగి ఉంది. దీని రేటు రూ. 14,999.

# సుజుకీ ఇయాక్సెస్ వచ్చేసింది.. ధర రూ.1.88 లక్షలు

సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తన తొలి విద్యుత్ స్కూటర్‌ను దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. తన విజయవంతమైన మోడల్ యాక్సెస్‌ను.. ఎలక్ట్రిక్ వెర్షన్‌లో ఇ-యాక్సెస్ పేరుతో లాంచ్ చేసింది. కంపెనీ తన గురుగ్రామ్ ప్లాంట్‌లో దీన్ని తయారు చేయనుంది. ఎలక్ట్రిక్ స్కూటర్ల మార్కెట్‌లో బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్తాతో ఇది పోటీ పడనుంది.

సుజుకీ ఇ-యాక్సెస్‌లో 3.07 kWh లిథియం ఐరన్ పాస్ఫేట్ బ్యాటరీని అమర్చారు. ఇది సింగిల్ ఛార్జ్‌తో 95 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఈ స్కూటర్‌లో 4.1kW ఎలక్ట్రిక్ మోటార్‌ను అమర్చారు. ఇది 15 Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పోర్టబుల్ ఛార్జర్‌తో 0-80 శాతం ఛార్జింగ్‌ను 4 గంటల 30 నిమిషాల్లో ఛార్జ్ చేయొచ్చని కంపెనీ పేర్కొంది. ఫాస్ట్ ఛార్జర్‌తో అయితే పూర్తి బ్యాటరీని ఛార్జ్ చేయడానికి 2 గంటల 12 నిమిషాల సమయం పడుతుందని కంపెనీ వెల్లడించింది. టాప్ స్పీడ్ గంటకు 71 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది.

ఇందులో పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంటల్ కన్సోల్ ఉంది. దీంట్లో ఎకో, రైడ్ ఏ, రైడ్ బి మోడ్‌లు ఉన్నాయి. రీజనరేటివ్ బ్రేకింగ్, రివర్స్ మోడ్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. బ్లూటూత్/యాప్ కనెక్టివిటీ ఉన్నాయి. యూఎస్‌బీ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. ఎల్ఈడీ లైట్స్ ఇచ్చారు. మొత్తం నాలుగు కలర్ ఆప్షన్లలో లభిస్తోంది. గతేడాది భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో దీన్ని తొలిసారిగా ప్రదర్శించారు. సుజుకీ డీలర్‌షిప్‌లతో పాటు ఫ్లిప్‌కార్ట్‌లో కూడా ఆర్డర్ చేయొచ్చు. ఏడేళ్లు లేదా 80వేల కిలోమీటర్ల వరకు వారెంటీ, సుజుకీ కస్టమర్లకు రూ.10వేల వరకు లాయల్టీ బోనస్, ఇతర వినియోగదారులకు రూ.7వేలు వెల్‌కం బోనస్ ఇస్తున్నారు. 5.99 శాతం వడ్డీ రేటుతో ఫైనాన్సింగ్ ఆప్షన్లు కూడా ఉన్నాయి.



# నిన్న క్రిస్టా.. నేడు ఫార్చ్యూనర్: భారీగా పెరిగిన ధరలు!




భారతదేశంలో టయోటా కంపెనీ తన ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచింది. దీంతో.. అత్యంత ప్రజాదరణ పొందిన పెద్ద SUVలలో ఒకటైన టయోటా ఫార్చ్యూనర్ రేటు గరిష్టంగా రూ. 74వేలు వరకు పెరిగింది.

**ధరల పెరుగుదల..** వేరియంట్లను బట్టి రూ. 51వేలు నుంచి రూ. 74వేలు మధ్య ఉంది. కాగా కంపెనీ లిమిటెడ్-రన్, డీలర్-లెవల్ లీడర్ వేరియంట్‌లను నిలిపివేసింది. ఫార్చ్యూనర్ & లెజెండర్ వరుసగా ₹ 74,000 మరియు ₹ 71,000 వరకు ధర పెరిగాయి. ఎంట్రీ-లెవల్ మాన్యువల్ వేరియంట్ ధర రూ. 51వేలు పెరిగింది. దీంతో ఈ SUV ధర ఇప్పుడు రూ. 33.65 లక్షల నుంచి రూ. 34.16 లక్షలకు (ఎక్స్-షోరూమ్) చేరింది.

**ఇన్నోవా క్రిస్టా ధరలు**

భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఎంపీవీలలో ఒకటైన టయోటా ఇన్నోవా క్రిస్టా లోయర్ స్పెక్ GX వేరియంట్ ధరలు రూ.33,000 వరకు పెరిగాయి. డీజిల్ పవర్డ్ లాడర్ ఫ్రేమ్ MPV మిడ్ స్పెక్ GX+ వేరియంట్‌ల ధరలు రూ.21,000 వరకు పెరిగాయి. మరోవైపు VX & ZX వేరియంట్‌లు ధరలు వరుసగా రూ. 25,000 & రూ. 26,000 వరకు పెరిగాయి.

# తొలిరోజే సెట్‌లో ఏడ్చేశా..

**'గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని పండగ విజయాన్ని అందుకున్నా. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకుల మనసుల్ని దోచుకుంటాననే నమ్మకముంది" అంటోంది నటి మీనాక్షి చౌదరి. నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన ఈ చిత్రాన్ని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది మీనాక్షి చౌదరి. ఆ విశేషాలివి..**



"ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఆసక్తికర కథతో రూపొందిన చిత్రమిది. దీంట్లో నా పాత్ర పేరు చారులత. సంపన్న కుటుంబంలో పుట్టిన గారాల పట్టి లాంటి పాత్ర. తను చాలా మంచి అమ్మాయి. అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. ఇంట్లో యువరాణిలా పెరుగుతుంది. తను చేసే పనులు ఫన్నీగా ఉంటాయి. నేనిలాంటి పూర్తిస్థాయి కామెడీ పాత్ర చేయడం ఇదే తొలిసారి. నా గత సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' కామెడీగా ఉన్నా.. నా పాత్ర కాస్త సీరియస్‌గానే ఉంటుంది.

కానీ, ఈ చిత్రంలో నాది పూర్తిగా వినోదాత్మక పాత్రే. నేనిప్పటి వరకు చేసిన పాత్రల్లో నాకు ఎక్కువ సవాల్‌గా అనిపించిన పాత్రిదే. ఎందుకంటే కామెడీ పండించడం చాలా కష్టం. పైగా ఇందులో కామెడీ కొత్తగా ఉంటుంది. టైమింగ్ చాలా కీలకంగా నిలుస్తుంది. పంచ్ డైలాగ్ కరెక్ట్ టైమింగ్‌తో చెప్పడం.. అవతలి వాళ్లు చెప్పినప్పుడు అదే టైమింగ్‌తో రియాక్షన్ ఇవ్వడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. అందులో నవీన్ పొలిశెట్టి లాంటి నటుడితో కలిసి కామెడీ చేయడం ఇంకాస్త సవాల్. ఎందుకంటే తన టైమింగ్ మరోస్థాయిలో ఉంటుంది".

"చిత్ర పరిశ్రమలో మనం స్థిరపడిపోయాం అని అనుకోవడానికి ఏం ఉండదు. నా దృష్టిలో సినీ ప్రయాణం అనేది ముగింపు లేని పరుగు పందెమే. ఈ రేస్‌లోకి ఎప్పటికప్పుడు కొత్తవాళ్లు వస్తూనే ఉంటారు. ఇక్కడ మనం స్థిరపడిపోయామని సంతృప్తి పడ్డామంటే అక్కడితో ఆగిపోయినట్లే. వెనక వచ్చే కొత్తవాళ్లు మన స్థానాన్ని దాటుకుని ముందుకెళ్లిపోతారు. అందుకే నేనెప్పుడూ సెటిల్ అయిపోయాను.. ఫలానా స్థానానికి చేరుకున్నాను లాంటి లెక్కలేం వేసుకోను. చేతిలో నిత్యం పని ఉండాలంటే విభిన్న పాత్రలు చేస్తూ నిర్విరామంగా పరిగెడుతూనే ఉండాలి. ఇంతమంది ఉన్న ఈ పరిశ్రమలో మనకే అవకాశాలు రావాలంటే.. వాళ్ల చిత్రాలకు మనం ఉండటం వల్ల ఏదోక ఉపయోగం ఉంటుందని దర్శక నిర్మాతలు నమ్మగలగాలి. దీనికోసం నటిగా నేను వందశాతం కష్టపడుతుంటా. క్రమశిక్షణగా ఉంటా".

"నటిగా నేను తొలిసారి సెట్‌లోకి అడుగు పెట్టింది 'అవుట్ ఆఫ్ లవ్' సిరీస్ కోసమే. తిగ్మాన్షు ధులియా దర్శకత్వం వహించారు. ఆయన సెట్‌లో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారు. నేను చిత్రీకరణలో పాల్గొన్న తొలిరోజే సెట్‌లో ఏడ్చేశాను. మా మేనేజర్‌కు ఫోన్ చేసి.. నా వల్ల కాదు, నేను చేయలేనని చెప్పేశా. కానీ, తను 'నువ్వలా చేయకు.. మనం కాంట్రాక్ట్ మీద సంతకాలు చేసేశామ'ని చెప్పి కన్విన్స్ చేశాడు. లేదంటే సెట్‌లోకి అడుగు పెట్టిన తొలిరోజే సినిమాలు, నటన వదిలేసేదాన్ని. ఆ సిరీస్ నుంచి మెల్లగా నటనపై అవగాహన పెంచుకుని.. తర్వాత ఒక్కో ప్రాజెక్ట్ చేసుకుంటూ నటిగా ఈరోజు స్థాయికి వచ్చా".

"ఈ సినిమా చేయడం వల్ల నటిగా నేను మరింత ఓపెన్ అయ్యాను. 'లక్కీ భాస్కర్'లోని సుమతి పాత్రకు దీంట్లో చేసిన చారులత పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందులో నా నుంచి అద్భుతమైన కామెడీ టైమింగ్‌ను చూస్తారు. స్వతహాగా నేను డ్యాన్స్ చేయడానికి కాస్త సిగ్గుపడుతుంటాను. కానీ, ఈ సినిమాలో నాకు అలాంటి ఇబ్బంది కలగలేదు. 'భీమవరం బాల్మా', 'రాజు గారి పెళ్లిరో' లాంటి క్యూట్ డ్యాన్స్ నంబర్స్ ఉన్నాయి. ఈ సినిమా కోసం గోదావరి ప్రాంతంలో చిత్రీకరణ చేయడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. అక్కడి ప్రజలు బాగా చూసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న ఆలయాలు, సందర్శనీయ ప్రదేశాల్ని చూశా. అక్కడి ప్రజలు సినిమా అంటే ప్రత్యేక అభిమానం చూపిస్తుంటారు. నాకది చాలా నచ్చింది".

"నా దృష్టిలో కథే హీరో. కథ ఎలా ఉంది.. దర్శకుడు దాన్ని ఎలా చెప్తాడు.. దాంట్లోని పాత్రల్ని ఎలా చూపిస్తాడు అనేది ఆలోచిస్తాను. నేను చేయబోయే పాత్ర నా కెరీర్‌కు ఎలా ఉపయోగపడుతుందనేది చూస్తాను. అంతే తప్ప దాంట్లో హీరో ఎవరనేది పట్టించుకోను. ప్రస్తుతం సినిమాల్లో కథానాయికల పాత్రలకు ఎంతో ప్రాధాన్యత పెరిగింది. ప్రతిఒక్కరికీ అలాంటి ప్రాధాన్యత పాత్రలు లభించడం సంతోషాన్నిస్తోంది. ఈమధ్య సమంత 'మా ఇంటి బంగారం' చిత్ర టీజర్ చూశా. నాకు చాలా నచ్చింది. అందులో సామ్ చేసిన లాంటి యాక్షన్ పాత్ర నాకూ చేయాలని ఉంది. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' సినిమా చేస్తున్నా. మరికొన్ని సినిమాలు ఓకే చేశా. ఆ చిత్ర విశేషాల్ని నిర్మాణ సంస్థలు త్వరలో ప్రకటిస్తాయి".



## గోల్డెన్ గ్లోబ్స్ 2026.. 'అడాలెసెన్స్'కు అవార్డు




ఇప్పటికే పలు అవార్డులు సొంతం చేసుకున్న 'అడాలెసెన్స్' మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. 'గోల్డెన్ గ్లోబ్స్ 2026' అవార్డుల్లో ఉత్తమ నటుడు, సహాయనటుడి జాబితాల్లో అవార్డును తన ఖాతాలో వేసుకుంది.

ఈ సిరీస్‌లో తన నటనతో మెప్పించిన ఓవెన్ కూపర్ ఉత్తమ సహాయనటుడిగా అతి చిన్న వయసులోనే ఈ అవార్డును సొంతం చేసుకొని రికార్డు సృష్టించాడు. అలాగే ఉత్తమ నటుడి కేటగిరీలో స్టీఫెన్ గ్రాహం అవార్డు అందుకున్నారు. వేదిక పైకి వచ్చిన ఓవెన్ కూపర్ ఆనందం వ్యక్తంచేశాడు. తనను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపాడు. తన చుట్టూ ఉన్న గొప్ప నటీనటుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పాడు. ఇక ఈ అవార్డు వేడుకలకు నిక్కీ గ్లేజర్‌తో పాటు ప్రియాంక చోప్రా కూడా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

విజేతలు వీరే..

- ఉత్తమ నటుడు (టీవీ సిరీస్) : స్టీఫెన్ గ్రాహం (అడాల్‌సెన్స్)
- ఉత్తమ నటి : రోజీ బేర్నీ (ఇఫ్ ఐ హేడ్ లెగ్స్ ఐడీడ్ కిక్ యూ)
- ఉత్తమ స్క్రీన్‌ప్లే: పాల్ థామస్ (వన్ బ్యాటిల్ ఆనథర్)
- ఉత్తమ సహాయనటుడు (టీవీ సిరీస్): ఓవెన్ కూపర్ (అడాల్‌సెన్స్)
- ఉత్తమ సహాయ నటుడు (సినిమా): స్టెలన్ (సెంటిమెంట్ వాల్యూ)
- ఉత్తమ సహాయ నటి (సినిమా): టెయానా టేలర్ (వన్ బ్యాటిల్ ఆనథర్)

### ఆ సినిమా వెంకటేష్‌కైతే

# బాగుండేదన్న చిరంజీవి



హీరో ఇమేజ్‌ను బట్టి సినిమా కథ, యాక్షన్, భావోద్వేగాలు ఉండాలి. అలా లేనప్పుడు ఎంత పెద్ద హీరో సినిమా అయినా సరే ప్రేక్షకులు అక్కున చేర్చుకోరు. తన సినిమా కథల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు అగ్ర కథానాయకుడు చిరంజీవి (Chiranjeevi). కొన్నిసార్లు ఫలితం వేరేలా ఉన్నా, ఎక్కువశాతం అభిమానులను అలరించేందుకే ప్రయత్నిస్తారు. కొన్ని కథలు తనకన్నా తోటి హీరోలకు బాగుంటుందని సలహాలు కూడా ఇస్తారు. అలాంటి చిత్రాల్లో 'డాడీ' (Daddy) ఒకటి. సురేశ్‌కృష్ణ దర్శకత్వంలో 2001లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. అయితే, చిరంజీవి మార్కు సూపర్‌హిట్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. ఈ సినిమా కథ చెప్పగానే మరొక ఆలోచన లేకుండా వెంకటేష్ (Venkatesh)కైతే బాగుంటుందని చిరంజీవి సలహా ఇచ్చారట. ఆనాటి సంగతులను ఓ సందర్భంలో చిరు పంచుకున్నారిలా..!

"'డాడీ' కథను నాకు వినిపించారు. వినగానే ఇది నాకంటే వెంకటేష్‌కు (Venkatesh) బాగుంటుందనిపించింది. ఈ కథకు తను న్యాయం చేయగలడనుకున్నా. రచయిత భూపతి రాజాకు ఇదే విషయం చెప్పా. 'ఇది ఆయనకు మామూలుగా ఉంటుంది. మీకైతే ఫ్యామిలీమ్యాన్‌గా కాస్త వెరైటీగా ఉంటుంది' అని భూపతిరాజా నన్ను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినా నేను కాస్త తటపటాయించా. ఈ కథ విన్న వారందరూ 'చిన్న పిల్లతో ఈ సినిమా మీకు బాగుంటుంది' అని సలహా ఇచ్చారు. చివరకు నేను కూడా బలవంతంగా ఒప్పుకొన్నా. రిజల్ట్ కూడా అలాగే ఉంది. కథ విన్నప్పుడు ఏమనుకున్నానో అదే జరిగింది. సినిమా విడుదలైన తర్వాత వెంకటేష్ నాకు ఫోన్ చేసి 'భలే సినిమా అండీ. నా మీద అయితే ఇంకా బాగా ఆడేదండీ' అనేశాడు. 'నీకైతే బాగుండేదని నేను చెప్పాను వెంకటేష్. కానీ వినలేదు' అని అన్నాను. అలాంటి కొన్ని ఫెయిల్యూర్స్ నా సినీ జీవితంలో ఉన్నాయి" అని చిరంజీవి (Chiranjeevi) చెప్పుకొన్నారు. ప్రస్తుతం ఈ కాంబో థియేటర్స్‌లో సందడి చేస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవర ప్రసాద్‌గారు' బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌ను తెచ్చుకుంది. సినిమా మొత్తం ఒకెత్తయితే, చివరిలో వెంకటేష్‌తో కలిసి చిరంజీవి చేసే హంగామా సినిమాకే హైలైట్‌గా నిలిచింది.

# రిమోట్ కంట్రోల్ మా ఆయనదే: ప్రియాంకా చోప్రా



అంతర్జాతీయ వేదికపై ప్రియాంక అందరి దృష్టిని ఆకర్షించారు. గోల్డెన్ గ్లోబ్స్ అవార్డుల వేడుకకు ఆమె (Priyanka Chopra) వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ వేడుక ప్రారంభానికి ముందు తన భర్త నిక్ జొనాస్‌తో (Nick Jonas) కలిసి రెడ్ కార్పెట్‌పై ఫొటోలకు పోజులిచ్చారు. ఇక వేదికపై ఒక ఆసక్తికర ప్రశ్నకు ఆమె సరదాగా బదులిచ్చారు. ఇంట్లో రిమోట్ ఎవరి చేతిలో ఉంటుందని అడగ్గా.. నిక్ చేతిలోనే ఉంటుందని చెప్పారు.

"గతేడాది మాకు చాలా గొప్పగా గడిచింది. టీవీలో ఏం చూడాలి అనే విషయంలో మా ఇంట్లో ఒకరితో ఒకరం గొడవపడం. ఎవరికి నచ్చింది వాళ్లు చూస్తాం" అని నిక్ తెలిపారు. దీనికి ప్రియాంక స్పందిస్తూ.. 'నిక్‌కు నచ్చిన సినిమానే చూడమని చెబుతాను. నేను నా ఐప్యాడ్‌లో చూస్తాను' అని చెప్పారు. 2018లో పెళ్లి చేసుకున్న ప్రియాంక- నిక్ జొనాస్‌లు 2022లో తల్లిదండ్రులయ్యారు. వారి కుమార్తెకు మాల్తీ మారీ చోప్రా జోనాస్ అనే పేరు పెట్టిన విషయం తెలిసిందే.

ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రియాంక వరుస ప్రాజెక్ట్‌లతో అలరిస్తున్నారు. ప్రస్తుతం రాజమౌళి - మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి'లో నటిస్తున్నారు. ఇందులో ఆమె మందాకిని పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఈ సినిమా ఈవెంట్‌లోనూ ఆమె తళుక్కున మెరిశారు. దీంతో పాటు 'ది బ్లఫ్'లోనూ నటిస్తున్నారు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఫిబ్రవరి 25 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది.

# ఆ విషయంలో నాది అత్యాశే!

మంచి స్క్రిప్ట్ ఉంటే భాష ఏదైనా సరే.. అది తనకు కావాలని అంటోంది మలయాళ నాయిక కల్యాణి ప్రియదర్శన్. 'లోక చాప్టర్ 1: చంద్ర' విజయం తర్వాత కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తోంది తార. ఇందులో భాగంగానే ఈమె.. రణ్‌వీర్ సింగ్ నటిస్తోన్న 'ప్రలే' సినిమాతో హిందీలో అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కల్యాణి.. దీనిపై స్పందిస్తూ.. "నేను హిందీ సినిమాలు కూడా చేయాలనుకుంటున్నా. కానీ మంచి కథలు దొరికితేనే ముందడుగు వేస్తా. కథలు చెప్పే విషయంలో భాషను ఎప్పుడూ అడ్డంకిగా చూడలేదు. భావోద్వేగమే ముఖ్యమని నమ్ముతా. ప్రస్తుతం పాన్ ఇండియా కథల వల్ల ప్రేక్షకులు పలు భాషల సినిమాలపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పాటు భాష ఏదైనప్పటికీ మంచి కథలు ఎప్పుడూ నన్ను వెతుక్కుంటూ వస్తాయని నమ్ముతుంటా. స్క్రిప్ట్ విషయంలో నాకు అత్యాశ ఎక్కువ" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'జెనీ', 'మార్షల్' లాంటి తదితర చిత్రాలున్నాయి.



# ప్రేక్షకులు లేకుండానే డబ్ల్యూపీఎల్‌లో ఆ మూడు మ్యాచ్‌లు




మహిళల ప్రీమియర్ లీగ్ (WPL)లో జనవరి 14,15, 16 తేదీల్లో జరగాల్సిన మ్యాచ్‌లు ప్రేక్షకులు లేకుండానే జరిగే అవకాశముంది. ఈ నెల 15న బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (BMC) ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 15న జరగాల్సిన ముంబయి ఇండియన్స్, యూపీ వారియర్స్ మ్యాచ్‌కు భద్రత కల్పించలేమని ముంబయి పోలీసులు బీసీసీఐకి సమాచారం అందించారు. ఎన్నికలకు ముందు, తర్వాత రోజు జరిగే మ్యాచ్‌లు కూడా ప్రేక్షకులు లేకుండానే జరిగే అవకాశముంది. 14న దిల్లీ క్యాపిటల్స్, యూపీ వారియర్స్, 16న గుజరాత్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌లు జరగనున్నాయి.ఈ మ్యాచ్‌లకు ప్రేక్షకులకు అనుమతి ఉందా? లేదా? అనే దానిపై బీసీసీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. కానీ, సదరు మ్యాచ్‌ల టికెట్లు అమ్మకానికి లేవు. జనవరి 17న జరగనున్న ముంబయి, యూపీ.. దిల్లీ, బెంగళూరు మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం మాత్రం మొదలైంది. డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లో ఫైనల్ మ్యాచ్‌తో కలిపి మొత్తం 22 మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి 11 మ్యాచ్‌లు ముంబయిలో, మిగతా మ్యాచ్‌లు వడోదరలో షెడ్యూల్ చేశారు.

# బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికల మార్పు..! మాకు సమాచారం లేదు: బీసీసీఐ




టీ20 ప్రపంచ కప్ 2026 (T20 World Cup)లో బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికలపై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ తన గ్రూప్ మ్యాచ్‌లను కోల్‌కతా, ముంబయిలో ఆడాల్సి ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా తాము భారత్‌లో మ్యాచ్‌లు ఆడలేమని.. వాటిని శ్రీలంకలో నిర్వహించాలని బంగ్లా క్రికెట్ బోర్డు (BCB).. ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. ఆ అభ్యర్థనను తిరస్కరిస్తూ చెన్నై, తిరువనంతపురంలో ఆడాలని బీసీబీకి ఐసీసీ సూచించినట్లు వార్తలొచ్చాయి. ఈ పరిణామాల వేళ తాజాగా బీసీసీఐ స్పందించింది. బంగ్లాదేశ్ మ్యాచ్‌ల వేదికల మార్పునకు సంబంధించి ఐసీసీ నుంచి తమకు ఎటువంటి సమాచారం అందలేదని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా సోమవారం తెలిపారు. 'బంగ్లాదేశ్ మ్యాచ్‌లను చెన్నై లేదా మరో చోటుకి మార్చే విషయమై బీసీసీఐ (BCCI)కి ఎలాంటి సమాచారం అందలేదు. ఈ అంశంతో మాకు సంబంధం లేదు. ఇది బీసీబీ, ఐసీసీ మధ్య కమ్యూనికేషన్‌కు సంబంధించిన విషయం. వేదిక మార్పునకు సంబంధించిన ఐసీసీ మాకు ఏదైనా నిర్ణయం తెలియజేస్తే.. ఆతిథ్య దేశంగా బీసీసీఐ అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతానికి అటువంటి సమాచారం మాకు తెలియదు' అని దేవజిత్ సైకియా అన్నారు. షెడ్యూల్ ప్రకారం 2026 టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్, 17న వాంఖడేలో నేపాల్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

# భారత లాయర్స్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా సునీల్ గౌడ్



భారత లాయర్స్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా తెలంగాణ హైకోర్టుకు చెందిన సునీల్ గౌడ్ ఎంపికయ్యారు. శనివారం న్యూఢిల్లీ వేదికగా జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఢిల్లీ హైకోర్టుకు చెందిన కుల్దీప్ పరిహార్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక కాగా... సునీల్ గౌడ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేలు మురుగన్ (తమిళనాడు హై కోర్టు), ఆదిత్య చౌదరి (సుప్రీంకోర్టు) ఉపాధ్యక్షులుగా ఎన్నిక కాగా... కేరళ హైకోర్టుకు చెందిన నవీన్ సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. కర్ణాటక లాయర్ సునీల్ కోశాధికారిగా ఎన్నిక కాగా... అజయ్ (పంజాబ్, హరియాణా హై కోర్టు), రాహుల్ (అలహాబాద్ హై కోర్టు) ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# ఆమె కానీ కొట్టిందంటే..



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబయితో దిల్లీ మ్యాచ్.. షినెలీ హెన్రీ బౌలింగ్‌లో అమేలియా కెర్ షాట్ ఆడబోతే బంతి బ్యాట్‌ను తాకి వికెట్ల వెనక్కి వెళ్లింది. వికెట్ కీపర్ డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోగానే స్టేడియం హోరెత్తింది. గుజరాత్‌తో తర్వాతి మ్యాచ్.. లక్ష్యం 210 పరుగులైనా దిల్లీ ఛేదనలో దూసుకెళ్లింది. ఆ జట్టు ఓపెనర్ షాట్ కొట్టిన ప్రతిసారీ స్టేడియంలోని అభిమానుల నుంచి ఒకటే అరుపులు. వ్యాఖ్యాతలు సైతం ఆమె ఆటకు ఆశ్చర్యపోతూ అంతే గట్టిగా అరిచారు. పైన చెప్పుకొన్న క్యాచ్ అంత అసామాన్యమైందేమీ కాదు. ఆమె ఆడిన ఇన్నింగ్స్ కూడా అరుదైందేమీ కాదు. అయినా అందరూ అంతగా ఆశ్చర్యపోవడానికి, అంతగా అరవడానికి కారణం.. ఆడిన బ్యాటర్ రూపమే. మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా ఎన్నడూ చూడని భారీ అవతారంతో ఆ క్రికెటర్ ఉండడమే. తన పేరు.. లిజెలీ లీ. ప్రస్తుత డబ్ల్యూపీఎల్‌లో తన భారీ కాయంతో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది ఈ దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్. ఆట ఏదైనా ప్లేయర్లు నాజూగ్గా కనిపించాలి. ఎంతో ఫిట్‌గా ఉండాలి. క్రికెట్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. బ్యాటింగ్, ఫీల్డింగ్, వికెట్ కీపింగ్, బౌలింగ్.. ఇలా ఏం చేయాలన్నా ఫిట్‌గా ఉండాల్సిందే. మహిళల క్రికెట్లో కూడా పోటీ తత్వం బాగా పెరిగిన నేపథ్యంలో అమ్మాయిలు కూడా సిక్స్ ప్యాక్‌లు చేస్తున్న రోజులివి. ఇలాంటి సమయంలో లిజెలీ అవతారం చూస్తే.. ఆమె ప్రొఫెషనల్ క్రికెట్లో కొనసాగుతుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అలా కనిపిస్తుంది కానీ.. లిజెలీ మైదానంలో ఎంత చురుగ్గా ఉంటుందో డబ్ల్యూపీఎల్ ప్రేక్షకులు చూస్తున్నారు. దక్షిణాఫ్రికా క్రికెట్లో దిగ్గజ స్థాయిని అందుకున్న లిజెలీ.. రిటైర్మెంట్ తర్వాత, 34వ పడిలో డబ్ల్యూపీఎల్ అరంగేట్రం చేయడం చిత్రమే. ఈలోపు ఆమె చాలా ఘనతలే సాధించింది. కెరీర్ ఆరంభం నుంచి ఆమె విధ్వంసక బ్యాటింగ్‌కు మారుపేరు. 2013లో దక్షిణాఫ్రికా దేశవాళీ మహిళల టీ20 లీగ్‌లో 84 బంతుల్లోనే 169 పరుగులతో అజేయంగా నిలవడంతో ఆమె పేరు మార్మోగింది. ఆ రోజుల్లో మహిళల క్రికెట్లో అలాంటి మెరుపు ఇన్నింగ్స్ అరుదు. దీంతో తర్వాతి ఏడాదే దక్షిణాఫ్రికా జాతీయ జట్టులోకి వచ్చేసింది లిజెలీ. ఎనిమిదేళ్ల పాటు జట్టులో రెగ్యులర్ ప్లేయర్‌గా ఉంది. ఓపెనర్‌గా కెరీర్‌ను ఆరంభించిన ఆమె.. తర్వాత మిడిలార్డర్లోనూ బ్యాటింగ్ చేసింది. దక్షిణాఫ్రికాకు 100 వన్డేల్లో ప్రాతినిధ్యం వహించిన లిజెలీ.. 3 శతకాలు సహా 3315 పరుగులు చేసింది. 82 టీ20ల్లో ఒక సెంచరీ సహా 1896 పరుగులు సాధించింది. ఆమె రెండు టెస్టులూ ఆడింది. ఆమె మూడు టీ20 లీగ్‌స్‌లోనూ ఆడింది. మహిళల బిగ్ బాష్‌లో ఆమెది పెద్ద కెరీరే. అందులో 104 మ్యాచ్‌ల్లో 2770 పరుగులు చేసింది. అందులో అయిదు శతకాలుండడం విశేషం.

**అందుకే ఆలస్యంగా ఐపీఎల్‌లోకి..:** భారత్‌లో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభమైంది 2023లో. కానీ ఈలోపే లిజెలీ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరైపోయింది. 2022లో ఆమె వీడ్కోలు పలికింది. బిడ్డకు జన్మనివ్వడంతో లీగ్ క్రికెట్‌కు కూడా విరామం ఇచ్చింది. తల్లి అయ్యాక లిజెలీ మరింత బరువు కూడా పెరిగింది. ఇక ఆమె ఆటకు పూర్తిగా టాటా చెప్పేస్తుందనుకున్నారు. కానీ మళ్లీ బిగ్ బాష్‌లోకి పునరాగమనం చేసి సత్తా చాటుకుంది. కొన్నేళ్ల ముందే భర్తతో కలిసి ఆమె ఆస్ట్రేలియాలో స్థిరపడింది. 2024లో ఆమెకు ఆ దేశ పౌరసత్వం కూడా లభించింది. వయసు పెరిగినా, భారీ కాయంతో ఉన్నా నిలకడగా ఆడుతుండడంతో ఈ సీజన్ ముంగిట వేలంలో డబ్ల్యూపీఎల్ ఫ్రాంఛైజీలు లిజెలీ పట్ల ఆసక్తి ప్రదర్శించాయి. దిల్లీ క్యాపిటల్స్ రూ.30 లక్షలకు ఆమెను సొంతం చేసుకుంది. ఈ ధరకు పూర్తి న్యాయం చేస్తూ రెండో మ్యాచ్‌లోనే సుడిగాలి ఇన్నింగ్స్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది లిజెలీ. ఆటతో పాటు తన రూపంతోనూ ఆమె లీగ్ అయ్యేవరకు వార్తల్లోనే నిలిచేలా కనిపిస్తోంది.

# నో షేక్‌హ్యాండ్.. ఐ డోంట్ కేర్: సబలెంకా రియాక్షన్ వైరల్




బెలారస్ టెన్నిస్ స్టార్ అరియానా సబలెంకా కొత్త ఏడాదిని, కొత్త సీజన్‌ను టైటిల్‌తో ప్రారంభించింది. బ్రిస్బేన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో టాప్ సీడ్ సబలెంకా.. మార్టా కొస్టుక్‌పై ఏకపక్ష విజయం సాధించింది. అయితే, మ్యాచ్ అనంతరం సబలెంకాతో కరచాలనం చేసేందుకు ఉక్రెయిన్‌కు చెందిన మార్టా నిరాకరించింది. ఉక్రెయిన్‌లో పరిస్థితుల నేపథ్యంలో రష్యా, బెలారస్ ప్లేయర్లతో షేక్‌హ్యాండ్‌కు దూరంగా ఉండాలని తాను పెట్టుకున్న నియమాన్ని ఇక్కడ కూడా 23 ఏళ్ల మార్టా పాటించింది. ఈ విషయంపై సబలెంకా తాజాగా స్పందించింది.

**--నేను అసలు పట్టించుకోను....** "అది ఆమె నిర్ణయం. అందుకు నేనేం చేయగలను?.. ఆమె షేక్‌హ్యాండ్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా నాకేమీ తేడా ఉండదు. నేనసలు ఆ విషయాన్నే పట్టించుకోను. ఒక్కసారి కోర్టులో దిగిన తర్వాత నా ధ్యాసంతా ఆట మీదే ఉంటుంది. కోర్టులో అడుగుపెట్టిన తర్వాత గెలవాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగుతాను. మర్టా లేదంటే జెస్సికా పెగులా.. నా ప్రత్యర్థిగా వీరిలో ఎవరు ఉన్నారన్నది ముఖ్యం కాదు. నా అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలవడం.. ట్రోఫీని అందుకోవడంపై మాత్రమే దృష్టి సారిస్తా. నేను కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదు. అథ్లెట్‌గా నా పనిని నేను సక్రమంగా పూర్తి చేస్తాను" అని సబలెంకా.. మార్టాకు పరోక్షంగా గట్టిగానే కౌంటర్ ఇచ్చింది. కాగా 2022 నుంచి రష్యా, బెలారస్ ప్లేయర్లతో షేక్‌హ్యాండ్‌కు మార్టా దూరంగా ఉంటోంది.

**--రూ. 1 కోటీ 93 లక్షలు....** ఇక మ్యాచ్ విషయానికొస్తే.. ఆదివారం ముగిసిన బ్రిస్బేన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా 6-4, 6-3తో మార్టా కొస్టుక్‌ను ఓడించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఒక ఏస్ సంధించింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. తొలి సర్వీస్‌లో 32 పాయింట్లకుగాను 26... రెండో సర్వీస్‌లో 20 పాయింట్లకుగాను 12 పాయింట్లు సంపాదించింది. ఇక సబలెంకా కెరీర్‌లో ఇది 22వ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. విజేతగా నిలిచిన బెలారస్ స్టార్‌కు 2,14,530 డాలర్ల (రూ. 1 కోటీ 93 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# టైటిల్‌పై భారత షట్లర్ల గురి

### --ఇండియా ఓపెన్ నేటినుంచే




ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ గురిపెట్టారు. సొంతగడ్డ ప్రయోజనాన్ని సానుకూలంగా మలుచుకుని ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను సొంతం చేసుకోవాలని సింధు, లక్ష్యసేన్ పట్టుదలగా ఉన్నారు. గతంలో భారత్ తరఫున సైనా నెహ్వాల్ (2010).. కిదాంబి శ్రీకాంత్ (2015).. సింధు (2017).. లక్ష్యసేన్, సాత్విక్‌సాయిరాజ్ చిరాగ్‌శెట్టి (2022) ఇండియా ఓపెన్‌లో విజేతలుగా నిలిచారు. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో నుయన్ లిన్ (వియత్నాం)తో సింధు, పాయ్ యు (చైనీస్ తైపీ)తో మాళవిక బాన్సోద్, వాంగ్ యి (చైనా)తో తన్విశర్మ తలపడనున్నారు. పురుషుల సింగిల్‌స్‌లో ఆయుష్ శెట్టితో లక్ష్యసేన్, శ్రీకాంత్‌తో తరుణ్ మన్నెపల్లి, లీ చుక్ (హాంకాంగ్)తో హెచ్.ఎస్. ప్రణయ్ పోటీపడనున్నారు. పురుషుల డబుల్‌స్‌లో చెన్ జి ప్రెస్లీ స్మిత్ (అమెరికా)తో సాత్విక్ చిరాగ్.. మహిళల డబుల్‌స్‌లో ఓర్నిచా సుకిత (థాయ్‌లాండ్)తో గాయత్రి

# 'ఈ క్షణం ఎల్లకాలం గుర్తుండిపోతుంది'



టాప్ సీడ్ హోదాకు తగ్గట్టు ఆడిన ఉక్రెయిన్ టెన్నిస్ స్టార్ ఎలీనా స్వితోలినా టైటిల్ నిరీక్షణకు తెరదించింది. మూడేళ్ల తర్వాత తన కెరీర్‌లో మరో టైటిల్‌ను జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన ఏఎస్‌బీ క్లాసిక్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ 13వ ర్యాంకర్ స్వితోలినా చాంపియన్‌గా అవతరించింది. న్యూజిలాండ్ వేదికగా ఫైనల్లో స్వితోలినా 6-3, 7-6 (10/8)తో ఏడో సీడ్ వాంగ్ జిన్‌యు (చైనా)పై గెలిచింది. ఓవరాల్‌గా స్వితోలినా కెరీర్‌లో ఇది 19వ సింగిల్స్ టైటిల్. ఈ ఉక్రెయిన్ ప్లేయర్ చివరిసారి 2023లో స్ట్రాస్‌బర్గ్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. 2024లో ఏఎస్‌బీ క్లాసిక్ టోర్నీలో స్వితోలినా ఫైనల్ చేరినా తుది పోరులో కోకో గాఫ్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. గత ఏడాది సెప్టెంబరులో మానసిక సమస్యలతో ఇబ్బందిపడిన స్వితోలినా ఆటకు విరామం ఇచ్చింది. మూడు నెలల తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన ఆమె ట్రోఫీని కూడా ముద్దాడింది. టైటిల్ నెగ్గిన స్వితోలినాకు 37,390 డాలర్ల (రూ. 33 లక్షల 74 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ నేపథ్యంలో తన జీవితంలో ఈ క్షణం ఎల్లకాలం గుర్తుండిపోతుందంటూ సోషల్ మీడియా వేదికగా స్వితోలినా ఉద్వేగానికి లోనైంది.

**--మెద్వెదెవ్ టైటిల్ నంబర్ 22.....** గత ఏడాది ఒక్క టైటిల్‌తో సరిపెట్టుకున్న రష్యా టెన్నిస్ స్టార్ డానిల్ మెద్వెదెవ్ ఈ సీజన్‌లో మాత్రం ఆరంభంలోనే టైటిల్‌ను గెల్చుకున్నాడు. ఆదివారం ముగిసిన బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో ప్రపంచ 13వ ర్యాంకర్ మెద్వెదెవ్ విజేతగా నిలిచాడు. బ్రాండన్ నకషిమా (అమెరికా)తో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ మెద్వెదెవ్ 6-2, 7-6 (7/1)తో విజయం సాధించాడు. 95 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మెద్వెదెవ్ 10 ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. మెద్వెదెవ్ కెరీర్‌లో ఇది 22వ సింగిల్స్ టైటిల్‌కాగా... 22 టైటిల్స్ వేర్వేరు కావడం విశేషం. ఒకసారి గెలిచిన టైటిల్‌ను అతను రెండోసారి సాధించలేదు. బ్రిస్బేన్ ఓపెన్ విజేత హోదాలో మెద్వెదెవ్‌కు 1,14,060 డాలర్ల (రూ. 1 కోటీ 3 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# అది ఇబ్బందే..

### –విరాట్ కోహ్లీ

తనకన్నా ముందున్న బ్యాటర్ ఔటైనప్పుడు స్టేడియంలో ప్రేక్షకులు హర్షధ్వానాలు చేయడం తనకు నచ్చదని విరాట్ కోహ్లీ అన్నాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో రోహిత్ ఔటైన అనంతరం ప్రేక్షకులు.. కోహ్లీ రాబోతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. దీని గురించి విరాట్ మాట్లాడాడు. "నిజాయితీగా చెప్పాలంటే.. ప్రేక్షకులు ఇలా చేయడం నాకు సంతోషాన్నివ్వదు. ధోని విషయంలో కూడా ఇలా జరగడం చూశా. ప్రేక్షకుల్లో ఉత్తేజం కలగడాన్ని నేను అర్థం చేసుకోగలను. నేను ఆటపైనే దృష్టిపెడతాను. ప్రేక్షకులు నా ఆటను చూడడానికి రావడాన్ని అదృష్టంగా భావిస్తా. వాళ్ల ముఖాలు చూసినప్పుడు సంతోషం కలుగుతుంది" అని కోహ్లీ అన్నాడు. తొలి వన్డేలో అతడు ఏడు పరుగుల తేడాతో శతకం చేజార్చుకున్న సంగతి తెలిసిందే. అయితే తానెప్పుడూ మైలురాళ్ల గురించి ఆలోచించని అతడు చెప్పాడు.

# బంగ్లా భద్రతకేమీ ముప్పు లేదు

### బీసీబీ విన్నపానికి ఐసీసీ తిరస్కారం?

భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడడంలో బంగ్లా ఆటగాళ్లకు భద్రత పరంగా ఏ ఇబ్బందీ ఉండదని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విన్నపం పట్ల సానుకూలంగా స్పందించని ఐసీసీ.. భారత్‌కు తమ ఆటగాళ్లను పంపలేమనడానికి బీసీబీ చెబుతున్న కారణాల పట్ల సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. బంగ్లా ఆటగాళ్లకు భారత్‌లో ముప్పు వాటిల్లేందుకు ఆస్కారం పెద్దగా లేదని ఐసీసీ నివేదికలో తేలింది! ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్‌తో పాటు శ్రీలంక కూడా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్‌ఇండియా తమ దేశానికి రానందుకు.. ఈ టోర్నీ కోసం పాకిస్థాన్ జట్టు భారత్‌లో పర్యటించట్లేదు. తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడబోతోంది. మరోవైపు బంగ్లాదేశ్‌తో భారత్ దౌత్య సంబంధాలు దెబ్బతినడం.. ఆ దేశంలో హిందువులపై తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతుండడంతో బంగ్లా పేసర్‌ను ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ వేలంలో ఎంచుకోవడంపై భారత అభిమానుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ అతణ్ని విడుదల చేయడంతో.. భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రత మీద ఆందోళన వ్యక్తం చేస్తూ తమ మ్యాచ్‌లను సైతం లంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీని కోరింది. కానీ భారత్‌లో పరిస్థితులు, బంగ్లా ఆటగాళ్ల భద్రతపై తమ ప్రతినిధులతో అధ్యయనం చేయించిన ఐసీసీ.. ఆందోళన అనవసరమని తేల్చింది. ఇదే విషయాన్ని బీసీబీకి స్పష్టం చేయనున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు రాక తప్పేలా లేదు. టోర్నీని బహిష్కరిస్తే ఆ జట్టు మ్యాచ్‌ల తాలూకు పాయింట్లు ప్రత్యర్థులకు వెళ్తాయి. పైగా ఐసీసీ క్రమశిక్షణ చర్యలకూ సిద్ధం కావాలి.